J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 7 19.07.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# అక్రమార్కుల వేటలో టీడీపీ - విదేశాల బాటలో వైసీపీ

## పాలనతో పాటు ప్రక్షాళనపై బాబు దృష్టి

### అటు రాజకీయశ్రేణులపైన.. ఇటు అధికార వర్గాలపైనా ఫోకస్

**అయిదేళ్ళకి ఒకసారి ఎన్నికలు జరగడం, ప్రభుత్వాలు మారడం రాజకీయాల్లో సర్వసాధారణం. ఒకవేళ ప్రజలని మెప్పించే విధంగా అధికారపార్టీ తన పాలన అందిస్తే... మళ్ళీ అదే పార్టీకి ప్రజలు పట్టం కట్టిన సందర్భాలు కూడా మనం చాలా చూశాం. ఉదాహరణకి ఉమ్మడి రాష్ట్రంలో 2004, 2009 సంవత్సరాలలో వరుసగా దివంగత నేత రాజశేఖరరెడ్డి పాలనకు ప్రజలు జైకొట్టారు. అదేవిధంగా రాష్ట్రం విడిపోయిన తరువాత తెలంగాణలో కేసీఆర్ నాయకత్వాన్ని అక్కడి ప్రజలు సమర్ధించి రెండవసారి అవకాశం ఇచ్చారు. మూడవసారి తిరస్కరించారు. కేంద్రంలో కూడా మోడీ సామర్థ్యాన్ని, సమర్ధతని మెచ్చుకుని రెండవసారి కూడా అధికారం కట్టబెట్టిన భారతీయ ఓటరు మూడవసారి హెచ్చరిక తరహాలో తీర్పు చెప్పారు.**



ఆంధ్రాలో 2014లో కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో జనం చంద్రబాబుకి అధికారం అప్పజెప్పారు. బాబుకి ఉన్న అపార అనుభవంతో అనాధగా మిగిలిపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తారని ఆశించారు. కానీ, ప్రజలు ఊహించిన స్థాయిలో చంద్రబాబు వారిని మెప్పించలేకపోయారు. కొన్ని తొందరపాటు నిర్ణయాలతో అభాసుపాలై 2019లో ఓడిపోయారు.

రాజశేఖరరెడ్డి కొడుకు, యువకుడు, విద్యావంతుడు, చరిష్మాగల నాయకుడు, ఒక్క అవకాశం ఇస్తే ముప్పై సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పాలిస్తానంటున్నాడు అని జగన్‌మోహన్‌రెడ్డిపైన భరోసా పెట్టుకున్న జనం ఆయనకి 151 సీట్లిచ్చి అధికారం కట్టబెట్టారు.

జగన్‌కి జనం ఇచ్చిన ఆ ఒక్క అవకాశం ఆయన సద్వినియోగం చేసుకోలేదు. ప్రజలు ఆశించిన స్థాయిలో ఆయన అనాధాంధ్రని గాడిన పెట్టలేకపోయారు. తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై డబ్బుల పంపిణీతోనే కాలక్షేపం చేశారు. ప్రజలు చాలా తెలివైనవాళ్ళు, నరేంద్ర మోడీ విషయంలో కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు భారతీయ ఓటర్లు ఎలాంటి తీర్పు చెప్పారో, అలాంటి తీర్పే తడ నుండి ఇచ్ఛాపురం వరకు ఆంధ్ర ఓటర్లు జగన్ విషయంలో ఇచ్చారు.

ఇలా ప్రభుత్వాలు గెలవటం, ఓడటం తరచూ జరిగే విషయాలే. సాధారణంగా అధికారపార్టీ ఓటమిపాలై మరో పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ పార్టీ దృష్టంతా ఓడిపోయిన పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పాలనా సంస్కరణలు, వాటి వైఫల్యాలపై ఉంటుంది. తమకంటే ముందు పాలించిన ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించడానికి గల కారణాలని కొత్త ప్రభుత్వం విశ్లేషించి సరిదిద్దుకుంటుంది.

అయితే, ఆంధ్రాలో తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి గత ప్రభుత్వం చేసిన పాలనాపరమైన తప్పులను సరిదిద్దడంతో పాటు,

10లో



## జిల్లాకి కొత్త పోలీస్‌బాస్


పని మొదలుపెట్టిన జి.కృష్ణకాంత్, ఐపీఎస్

యువసారధుల చేతిలో అధికార పగ్గాలు 3లో

## మత సామరస్యానికి ప్రతీక.. 'రొట్టెల పండుగ' వేడుక

వివరాలు 12లో



# విజయవంతంగా..'నారాయణ క్రికెట్ టోర్నమెంట్'

## విజేతలకు బహుమతులందజేసిన పొంగూరు రమాదేవి



నెల్లూరులోని విఆర్‌సి మైదానంలో 39వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి అన్నంగి ప్రసాద్ ఆధ్వర్యంలో ఇటీవల మంత్రి నారాయణ పేరుతో నిర్వహించిన 'పొంగూరు నారాయణ క్రికెట్ టోర్నమెంట్' విజయవంతంగా ముగిసింది. ఫైనల్స్‌లో... నవాజ్ 11 టీం, లగాన్ టీమ్‌లు హోరాహోరీగా తలపడ్డాయి. టోర్నమెంట్‌లో మొత్తం 40 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతగా నవాజ్ 11 టీమ్ నిలవగా... రన్నర్‌గా లగాన్ టీమ్ విజయం సాధించింది. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొని, విన్నర్ 11 టీమ్‌కి రూ.20వేలు, రన్నర్ టీమ్‌కి రూ.10వేలు, తృతీయస్థానంలో నిలిచిన సీఏఎం, లెవన్ స్టార్స్ టీమ్‌లకు రూ.7 వేల వంతున నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత క్రీడల్లో బాగా రాణించాలని, యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతోనే నారాయణ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

### డెంగ్యూ వ్యాధి పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

**- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య**

వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రజలు డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచలయ్య చెప్పారు. డెంగ్యూ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ఆయన నెల్లూరు నగరంలోని కుక్కలగుంట, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని ఈ సందర్భంగా సచివాలయ శానిటరీ కార్యదర్శికి సూచించారు. దోమలు పెరగకుండా, వ్యాధులు విజృంభించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, వైద్యాధికారి నాగార్జునరావు, కోటమిట్ట ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నవీన్‌కృష్ణ, శ్యామ్యూల్‌బాబు, తిరుపతయ్య పాల్గొన్నారు.

### ట్రిబుల్ ఐటీకి ఎంపికైన

# మునిసిపల్ స్కూలు విద్యార్థులు

నెల్లూరు నగరంలోని చిన్నబాలయ్య నగర్ మునిసిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుకున్న నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. దీంతో ఉత్తమ ప్రతిభతో ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించిన జయసాయినాగేంద్ర, హరి వెంకటతరుణ్, ప్రజ్ఞశ్రీ, రాణిలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జాస్మినమ్మ అభినందించారు 2023-24లో ఆ విద్యార్థులు 581 మార్కులు సాధించుకుని, తాజాగా ట్రిబుల్ ఐటీలో సీట్లు తెచ్చుకున్నారని, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# వీల్‌ఛైర్ వితరణ



నెల్లూరులోని ఎమ్మెస్సార్ స్పాస్టిక్ సెంటర్‌కు దాత దగ్గుబాటి సురేష్ క్వాడి వీల్‌ఛైర్‌ను తన వితరణగా అందజేశారు నడవలేనివారికి, మెట్లు ఎక్కలేనివారికి ఉపయోగపడేవిధంగా ఇటీవల రూ.12 వేల విలువచేసే ఆ వీల్‌ఛైర్‌ను స్పాస్టిక్ సెంటర్‌కు అందజేశారు. రెడ్‌క్రాస్ చార్టర్డ్ అకౌంటెంట్ చలపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ ప్రిన్సిపాల్ గురునాథరావు, రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు రంగయ్యనాయుడు, దాసరి రాజేంద్రప్రసాద్, జనార్ధన్‌రాజు, కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, కార్యదర్శి మస్తానయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# మమ్మల్ని జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలి

**- ఎమ్మెల్యే కాకర్లకు వినతి**

కలిగిరి, కొండాపురం, వింజమూరు సచివాలయాల్లో పనిచేసే పలువురు డిజిటల్ అసిస్టెంట్లు ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి 'మమ్మల్ని జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాలి' అంటూ వినతిపత్రం సమర్పించారు. వింజమూరు ఏపీ ఎన్‌జీఓల సంఘం అధ్యక్షుడు వెలుగోటి మధు ఆధ్వర్యంలో వారు ఎమ్మెల్యేను కలిశారు. వాళ్ల సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల, ఆ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కనీస మద్దతు ధరలు ప్రకటించాలి

## రైతుసంఘం నాయకుల డిమాండ్



వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు ప్రకటించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈనెల 13న నెల్లూరులోని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా కార్యాలయంలో జరిగిన రైతు సంఘం కమిటీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు గంగపట్నం రమణయ్య మాట్లాడుతూ, మద్దతు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సోమశిల ప్రాజెక్టులో పుష్కలంగా నీళ్లు లేకపోవడంతో 7 లక్షల ఎకరాలకు గాను కేవలం 3 లక్షల ఎకరాలు మాత్రమే రబీ సీజన్‌లో సాగయ్యాయని, ఖరీఫ్‌లో లక్ష ఎకరాల సాగు జరిగిందని, వర్షాలు కురవక జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. జిల్లాలోని సోమశిల, కండలేరు, కనిగిరి రిజర్వాయర్లలోనూ ఆశించిన స్థాయిలో నీళ్ళు లేక పంటపొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రైతులకు కనీసం 50 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు నాయకులు షానవాజ్, రాజగోపాల్, రమణయ్య, మస్తాన్‌బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# డా.ఎస్సార్కే స్కూల్‌లో.. ఓటు పట్ల అవగాహన



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి డా.ఎస్సార్కే స్కూల్‌లో ఇటీవల బాలబాలికలకు ఎన్నికల ప్రక్రియ పట్ల అవగాహన కలిగించారు. ఓటు ఎలా వేయాలో తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రఘురామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మెన్ డా. సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగమస్టర్లు వేశారు.. లక్షలు బొక్కేశారు

## ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది చేతివాటం

జిల్లాలో అనేకచోట్ల జరుగుతున్న ఉపాధి హామీ పనులను కొంతమంది క్షేత్రస్థాయి సిబ్బంది అవినీతిమయం చేస్తున్నారు. ఎక్కడ వీలైతే అక్కడ అందినకాడికి దోచుకుంటూనే ఉన్నారు. అలాంటి వారిని తనిఖీల్లో పట్టుకుంటున్నా గట్టిచర్యలు మాత్రం తీసుకోకపోవడంతో ఈ అవినీతి బాగోతాలు ఎంతోకాలంగా జోరుగా సాగుతూనే ఉన్నాయి. తాజాగా, అనంతసాగరం మండలంలో ఈ బాగోతం బయటపడింది. ఉపాధి హామీ పథకం ద్వారా, చేయని పనులను కూడా చేసినట్లు దొంగ మస్టర్లు వేసి, నిధులు కాజేస్తున్న వైనాన్ని ఇటీవల ఆడిట్ అధికారులు కనుక్కొన్నారు.

ఈ మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఏడాదిపాటు సుమారు 12కోట్ల రూపాయల వ్యయంతో ఉపాధి పనులు జరిగాయి. వీటిలో అనంతసాగరం, రేవూరు, పీకేపాడు, బొమ్మవరం గ్రామాల్లో పనులకు రానివారి పేర్లతో కలిపి మస్టర్లు సృష్టించారని గుర్తించారు. అసలు, ఎక్కడ పనులు జరిగాయి, ఎంతమంది పనులు చేశారు వగైరా అంశాలన్నిటినీ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలించడంతో ఈ గుట్టు రట్టయినట్లు సమాచారం. ఒక్క అనంతసాగరం మండలంలోనే లక్షల రూపాయల్లో స్వాహా జరిగిపోయినట్లు తనిఖీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అనంతసాగరం చెరువు పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారని, అయితే ఆ కాలువల్లో నిండా నీరుండగా పూడికతీత పనులు ఎలా చేశారని ఇటీవల అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సామాజిక సదస్సుల్లో అధికారులను స్థానిక




ప్రజలు, యువకులు నిలదీయడమే కాక, నిధుల దుర్వినియోగానికి మూలకారణమైన ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకోవాలని, స్వాహా అయిపోయిన నిధులను వారి నుంచి రాబట్టాలని కోరారు. ఉపాధి పనుల్లో నిధుల గోల్మాల్ జరుగుతోందని గతంలో ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదుచేసినా ఎవరూ పట్టించుకోకపోవడం వెనుక మతలబు ఏమిటో జిల్లా ఉన్నతాధికారులు ఇకనైనా పట్టించుకోవాల్సి ఉంది. జిల్లాలో మొత్తం ఎన్ని కోట్ల రూపాయల మేరకు ఉపాధి పనులు జరిగాయి, వాటిని ఎవరెవరికి ఎంతెంత కేటాయించారు, రికార్డుల్లో నమోదైన పనులు-క్షేత్రస్థాయిలో జరిగిన పనులెన్ని, వాటిలో స్వాహా జరిగినదెంత? అనే విషయాలపై ప్రభుత్వం ప్రత్యేకబృందాలతో తనిఖీలు చేయించాలని, అవినీతి అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# తెల్లరాయి అక్రమ తవ్వకాలపై.. అధికారుల ఆరా



సైదాపురం మండలం పరిధిలోని చాగణం గ్రామంలో ఉన్న తెల్లరాయి (వైట్ కార్ట్జ్)ని అక్రమంగా తవ్వేసి దోచుకుపోతున్నారంటూ వచ్చిన ఫిర్యాదులపై మైనింగ్‌శాఖ, రెవెన్యూశాఖల అధికారులు ఇటీవల ఆరా తీశారు. చాగణం గ్రామంలో తవ్వకాలు జరిగాయని అంటున్న ప్రాంతాలను పరిశీలించారు. అక్రమ తవ్వకాలపై సర్వే బృందంతో విచారణ చేయిస్తున్నామని, నివేదిక వచ్చాక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.




## ఎటు పోయావయ్యా విజయసాయి...

# ఇటు చూడవయ్యా మాసాయి!

**అయ్యా విజయసాయిరెడ్డీ...**

మేము గుర్తున్నామా...? మీకు ఓటేసిన 5,20,000 మంది అమాయకులం, అభాగ్యులం. ఎప్పుడో 67 సంవత్సరాల క్రితం మన నెల్లూరుజిల్లాలోని తాళ్లపూడిలో పుట్టారు మీరు. ఉన్నత చదువుల తరువాత మన జిల్లానే వదిలిపెట్టిపోయారు. వృత్తిరీత్యా, వ్యాపారరీత్యా పాతికేళ్ళకుపైగా మద్రాసు నగరంలో స్థిరపడిపోయారు. ఈ క్రమంలో... దివంగత మహానేత రాజశేఖరరెడ్డి కుటుంబానికి లెక్కలుచూసే అదృష్టం మీకు కలిగింది. ఆ అదృష్టం అవకాశంగా మారి మిమ్మల్ని ప్రజా జీవితానికి దగ్గరచేసింది. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానాల సభ్యుడిగా రెండు పర్యాయాలు స్వామివారి సేవచేసే అవకాశం మీకు లభించింది. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, డైరెక్టర్ అయ్యే పదవి మిమ్మల్ని వరించింది. అదే రాజశేఖరరెడ్డి అకాల మరణం తరువాత జగన్‌మోహన్‌రెడ్డి కేసులలో ఏ2గా తెలుగు సమాజానికి మీరు పరిచయమయ్యే విచిత్ర పరిస్థితి మీకు విధి కల్పించింది. వై.ఎస్. కుటుంబం కోసం జైలుకి సైతం వెళ్లి వారి ఋణం తీర్చుకునే అవకాశం కూడా మీకు లభించింది. బెయిలుపై జైలు నుండి వచ్చాక, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కీలక పాత్ర పోషించారు. జగన్ పార్టీ అధికారంలోకి రాకముందే 2016లోనే రాజ్యసభ సభ్యత్వాన్ని సాధించుకున్నారు. జగన్‌రెడ్డి కోటరీలో మీకు తిరుగులేదన్నట్లుగా చక్రం తిప్పారు. విశాఖ పట్టణాన్ని మీ అక్రమాల అడ్డాగా మార్చుకున్నారు. మళ్ళీ రెండవసారి కూడా రాజ్యసభ దక్కించుకున్నారు.

అక్కడితో తృప్తి చెందక 2024లో నెల్లూరుకొచ్చారు.

నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా బరిలోదిగారు. ప్రత్యక్ష ఎన్నికలలో పోటీచేశారు. పాతికేళ్లుగా నెల్లూరునే పట్టించుకోని మీరు, 'నెల్లూరు నా పురిటిగడ్డ' అంటూ నమ్మబలికారు.

### వాగ్దానాల వర్షం కురిపించారు..!

అర్బన్ డెవలప్‌మెంట్ అన్నారు... నెల్లూరుకు రింగురోడ్డు నిర్మించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేస్తానన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించి ప్రజారవాణాతో పాటు కార్గో ఎగుమతులకి కూడా సౌలభ్యం కల్పిస్తానని డాంబికాలు పలికారు. గతంలో కావలి - నెల్లూరు మధ్య దామవరం వద్ద చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఎయిర్‌పోర్టుని కూడా మన నాయకుడు జగన్ ఎగరేసుకుపోయి కందుకూరుకి సమీపంలో ప్రకాశంజిల్లా ప్రాంతానికి మారుస్తూ అసెంబ్లీలో ప్రకటన చేసిన విషయాన్ని మీరు మర్చిపోయినా నెల్లూరోళ్లు మర్చిపోలేదు. యువత-భవిత అన్నారు... సాఫ్ట్‌వేర్ పార్కులని, స్టార్టప్ ఇంక్యుబేటర్లని, టెక్ హబ్బులని, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అని, స్పాన్సర్డ్ స్టడీ స్కాలర్‌షిప్పులని, జాబ్ మేళాలని మేళం వాయించారు. పారిశ్రామిక అభివృద్ధి... అంటూ బిట్రగుంటలో మెగా ఇండస్ట్రియల్ పార్కన్నారు. మైక్రో ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్లన్నారు.. చాపలు, రొయ్యల హేచరీలన్నారు.

ఓయమ్మా... ఇలాంటివి చాలా చెప్పారు. మైపాడుకి పర్యాటక శోభ తెస్తానన్నారు. మహిళలకి వడ్డీ లేకుండా అప్పిస్తానన్నారు. ఉచిత ఆరోగ్య పరీక్షలన్నారు. రైతులకైతే సినిమా చూపించారు. సోమశిల హైలెవెల్ కాలువని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు. పెద్దపెద్ద గోడౌన్లు కడతానన్నారు. రైతులు, రైతు కూలీల కష్టాలు తీర్చేస్తానన్నారు. అయినా జనం మిమ్మల్ని నమ్మలేదు. రాజ్యసభ సభ్యుడిగా మీకొచ్చే నిధులలో గడచిన ఎనిమిదేళ్ళలో ఏనాడూ ఒక్కపైసా కూడా నెల్లూరు అభివృద్ధికి విదిలించని మీరు.. ఉన్నట్లుండి నెల్లూరుని రాష్ట్రంలోనే నంబర్‌వన్ చేస్తానంటూ జనం ముందు ప్రత్యక్షమైతే జనం ఎలా నమ్ముతారు...? వాళ్ళేం అమాయకులు కాదుకదా...! మేం మాత్రం 'గొర్రె కసాయిని నమ్మినట్లుగా' విజయసాయిని నమ్మాం. జిల్లాలో అయిదు లక్షలా ఇరవై వేల మందిమి మీ మాయలో పడిపోయాం.

### అయ్యా సాయి... చూడవయ్యా మాసాయి..!

మీకు మద్దతుగా నిలిచి, మీ వెంట నడిచిన పాపానికి.... ఇప్పుడు మామీద దాడులు జరుగుతున్నాయి. అవతలి పార్టీవాళ్ళు మా ఇళ్ళ మీదకి దౌర్జన్యానికి వస్తున్నారు. మా వ్యాపారాలని అడ్డుకుంటున్నారు. తప్పుడు కేసులు బనాయించి మమ్మల్ని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారు. మా ఇళ్లలో నుండి బయటకి రావడానికి కూడా మేం భయపడే భయానక వాతావరణంలో బతుకుతున్నాం. మొన్నటి ఎన్నికలలో వైసీపీ జెండా భుజాన పెట్టుకుని మిమ్మల్ని మా నెత్తిన ఎక్కించుకున్నందుకు మాకు దక్కిన గౌరవం ఇది. మీ అధినాయకుడి దగ్గర మీ విధేయతని ప్రదర్శించుకునే క్రమంలో మమ్మల్ని పావులని చేశారు. ఓడిపోయిన మీరు పారిపోయి ఢిల్లీ, హైదరాబాదుల మధ్య గాల్లో తిరుగుతున్నారు. మేం మాత్రం ప్రాణాలు గాల్లో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నాం. బహిరంగంగా, నిర్భయంగా ఈవిఎంని పగలగొట్టి ఎన్నికల కమిషన్ పెట్టిన కేసుతో జైల్లో వున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పలకరించడానికి మన పార్టీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆ మధ్య నెల్లూరుకు వచ్చారు. అప్పుడైనా మీరొస్తారని ఆశపడ్డాం. మీతో మా బాధలు చెప్పుకుందామని ఎదురు చూశాం.. కానీ, మీరు మాత్రం రాలేదు. అంతటి నేరం చేసిన పిన్నెల్లిపై జగన్‌మోహన్‌రెడ్డికి వున్న ఆపాటి ప్రేమ కూడా మీకు మాపై లేకపోవడం మా దురదృష్టం. ఉన్నట్లుండి జిల్లాలో ప్రత్యక్షమైన మీ భారాన్ని మోసి మేమేం నేరం చేశామో మాకే అర్థం కావడంలేదు.

అయ్యా విజయ సాయి...

మమ్మల్ని చూడాలని, పలకరించాలని, పరామర్శించాలని మీకు లేకపోయినా, కౌంటింగు తరువాత కనపడని మిమ్మల్ని ఒక్కసారి చూడాలని ఉంది. అందుకే అడుగుతున్నాం ఓ విజయసాయి... కాస్త చూడవయ్యా మాసాయి!

మీ రాకకై ఎదురుచూస్తూ.... మీకు ఓటేసిన 5,20,000 మంది ఓటర్లు.

# బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వాలి

## - సీఎం చంద్రబాబు, లోకేష్‌లను కోరిన వేమిరెడ్డి దంపతులు -





త్వరలోనే బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో, నెల్లూరు జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చి విరివిగా నిధులు కేటాయించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. ఆయన సతీమణి-కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు కోరారు. ఈనెల15న వారు అమరావతిలోని సచివాలయానికి వెళ్ళి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేష్‌ను కలిసి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లా అభివృద్ధికి నిధుల మంజూరు విషయాన్ని వారు ముఖ్యమంత్రికి విన్నవించారు. కోవూరు నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేసి, యువతకు ఉపాధిని కల్పించాలంటూ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మంత్రి లోకేష్‌ను కోరారు. వేమిరెడ్డి దంపతుల వెంట టీడీపీ నాయకుడు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# జిల్లాకి కొత్త పోలీస్‌బాస్

- పని మొదలుపెట్టిన జి.కృష్ణకాంత్, ఐపీఎస్
- యువసారధుల చేతిలో అధికార పగ్గాలు



జిల్లాకు ఇద్దరు యువ అధికారులు వచ్చారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న బదిలీల్లో భాగంగా, నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా ఓ.ఆనంద్ ఇటీవలే బాధ్యతలు చేపట్టగా, ఈనెల 15న కొత్త ఎస్పీగా యువ ఐపీఎస్ అధికారి జి. కృష్ణకాంత్ విధుల్లో చేరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్పీ కృష్ణకాంత్ విలేకర్లతో మాట్లాడుతూ, కర్నూలు ఎస్పీగా తాను 15నెలలు పనిచేశానని, తనపై నమ్మకంతో నెల్లూరుజిల్లా ఎస్పీగా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, డీజీపీ ద్వారకా తిరుమలరావుకు కృతజ్ఞతలని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా చేయాలన్నది తన లక్ష్యమని తెలిపారు. జిల్లాలో నేరాలను కట్టడిచేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యల సాధనకు కృషిచేస్తానన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికీ ప్రాధాన్యత ఇస్తానన్నారు.





జిల్లాకు వచ్చిన కొత్త ఎస్పీ తొలుత జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాకు చెందిన రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామినిలను గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లాకు కొత్త ఎస్పీ రాగానే, నెల్లూరులో అత్యంత ప్రతిష్టాత్మకమైన బారాషహీద్ దర్గాలో అయిదురోజుల పాటు జరిగే రొట్టెలపండుగ కార్యక్రమం పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. దేశవిదేశాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తుండడంతో, తొలిసారిగా ఆయన ఆ కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు భద్రతకు 2వేల మంది పోలీసు సిబ్బందిని నియమించి, దర్గా వద్ద ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లాకు యువకులైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కలెక్టర్, ఎస్పీలుగా రావడంతో అధికార యంత్రాంగంలో కూడా కదలిక వచ్చింది. వారిద్దరి చొరవతో జిల్లా అభివృద్ధికి ఉత్సాహంగా అడుగులు పడతాయని అందరూ ఆశిస్తున్నారు. కొత్త కలెక్టర్, ఎస్పీలకు 'లాయర్' శుభాకాంక్షలు.

లాయర్
జులై 19, 2024

# ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

ఆర్థికబాధలు, మానసిక-శారీరక ఇబ్బందులు, కుటుంబ కష్టాలు, వ్యక్తిగత సమస్యలు, నిత్యం పనిఒత్తిడులు.. కారణాలేమైతేనేం క్రమేణా ఆత్మహత్యలు పెరిగిపోతుండడం దేశానికిప్పుడు పెద్ద సమస్యగా తయారవుతోంది. దృఢచిత్తంతో సమస్యలను ఎదుర్కోలేక, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యల దారి చూసుకుంటున్నవారి సంఖ్య ఎక్కువైపోతుండడం బాధాకరం. తాజాగా జాతీయ నేరగణాంక రికార్డుల ప్రకారం భారత్‌లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారి సంఖ్య ఏ ఏడాదికాయేడాది పెరిగిపోతూ వుంది. 2020లో 11.3శాతంగా ఉన్న ఆత్మహత్యల సంఖ్య, 2021 నాటికి 12 శాతానికి, 2022 కల్లా 12.4 శాతానికి పెరగడం విచారకరం. 2020లో 1,53,052 మంది, 2021లో 1,64,033 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్లు పాత రికార్డులు చెప్తున్నాయి. ఇలా ప్రతిఏటా పెరుగుతున్న ఆత్మహత్యలు ఆయా కుటుంబాల్లో పెద్ద విషాదాలుగా మిగిలిపోతున్నాయి. ముఖ్యంగా నగరప్రాంతాల్లో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. దేశంలో మొత్తంగా ఆత్మహత్యల శాతం 12 లోపే ఉంటే, పెద్ద పెద్ద నగరాల్లో అది 16.1 శాతంగా ఉంటోంది. వయసుకు తగ్గట్టుగా పెళ్ళిళ్లు కాకపోవడం కూడా ఒక పెద్ద సమస్యగా తయారైందని, దీంతో అబ్బాయిలే ఎక్కువ సంఖ్యలో ఆత్మహత్యలకు గురవుతున్నారని కూడా తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. కుటుంబసమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నవారిలో వివాహ సమస్యలు కూడా కీలకంగా ఉంటున్నాయి. పెళ్ళివయసు దాటిపోతున్నా పెళ్ళి కావడం లేదే అనే మనోవ్యథ ఏదో ఒక బలహీన క్షణంలో ఆత్మహత్యకు ప్రేరేపిస్తోందని, దీంతో, మానసికంగా సున్నితంగా ఉండే అమ్మాయిల కంటే అబ్బాయిలే కుంగుబాటుకు ఎక్కువగా గురవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని నిపుణులు చెప్తున్నారు. వాస్తవానికి గతంలో కన్నా ఇటీవలి కాలంలో మహిళల్లో సాధికారత పెరిగింది కూడా. మహిళలు పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తూ ప్రతిభతో రాణిస్తున్నారు. అనేక రంగాల్లో పురుషులకు ధీటుగా ముందుకు దూసుకుపోతున్నారు. పాతకాలంలో లాగా పెద్దవాళ్ళు చూపించిన సంబంధాలనే ఖచ్చితంగా అంగీకరించాల్సిన పరిస్థితి ఇప్పుడు ఉండడం లేదు. అన్ని విధాలా తమకు నచ్చిన వారిని, అమ్మాయిలే వివాహానికి ఎంచుకునే స్వేచ్ఛ వచ్చేసింది. అత్యధిక కుటుంబాల్లో ఇప్పుడు అదే జరుగుతోంది కూడా. తల్లితండ్రులు సైతం తమ బిడ్డల ఇష్టాయిష్టాలను తెలుసుకుని వారికి ఇష్టమైన వివాహాన్నే కుదురుస్తున్నారు. మారుతున్న నేటి సామాజిక పరిస్థితుల్లో మారలేని వారు అటూ ఇటూ తేల్చుకోలేక మధ్యలో నలిగిపోతున్నారు. అయితే, వివాహాలు అయిపోగానే సమస్యలు సమసిపోవడం లేదు. ఆ తర్వాత కూడా సమస్యలు వస్తూనే వున్నాయి. వాటిని సరిదిద్దుకోలేక వివాహబంధాలను దూరం చేసుకునేవారూ లేకపోలేదు.

కోరుకున్న ఉద్యోగాలు రాకపోవడం, నిరుద్యోగంతో బాధలుపడడం, పేదరికం, కుటుంబాల్లో ఇతరత్రా అనేకరకాల సమస్యలు అన్నీ కలిసి వెరసి ఆయా కుటుంబాల్లో బలహీన మనస్సులపై బాగా ప్రభావం చూపుతున్నాయి. విద్యార్థుల జీవితాల్లో కూడా ప్రధానంగా చదువులపై వత్తిడి బాగా పెరగడం కూడా ఆత్మహత్యలకి దారితీయడం బాధాకరం. ప్రతిఏటా విద్యార్థుల మరణాలు కూడా మనదేశంలో గణనీయంగా పెరుగుతున్నాయని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. యువతలో, విద్యార్థుల్లో జీవితం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయి. అందుకే అటు చదువుల పట్ల-ఇటు జీవితం పట్ల సరైన చైతన్యం కలిగేవిధంగా విద్యార్థులకు చిన్నతనం నుంచే ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు, తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మానసిక ఒత్తిడులు అధికంగా ఉంటే.. నిపుణుల సలహాలు తీసుకుని వారిలో ధైర్యం కల్పించాలి. పాఠశాలల్లో చిన్నస్థాయిలోనే విద్యార్థులకు మంచి చెడులను బోధించి, పాఠాలతో పాటు వారికి జీవిత పాఠాలు కూడా నేర్పాలి. వారిని ధీరోదాత్తులుగా తయారు చేయాలి. ఎంతటి సమస్యనైనా ఆత్మవిశ్వాసంతో అధిగమించేలా తీర్చిదిద్దాలి. జీవితమన్న తర్వాత సుఖ దుఃఖాలు రెండూ ఉంటాయని చెప్పాలి. చీకటి వెనుకే వెలుతురు కూడా ఉంటుందని, సమస్యలను ఆత్మస్థైర్యంతో అధిగమిస్తే జీవితం ఆనందమయం అవుతుందని వారికి అర్థమయ్యేలా తెలపాలి. శారీరక, మానసిక ఒత్తిడులు సమసిపోయేలా చూడాలి. ఏదేమైనా, నిత్యం మనోవేదనలతో, కుంగుబాటుతో సమస్యల వలయంలో పడి ఆత్మహత్యల వైపు కొట్టుకుపోతున్న నేటితరాన్ని కాపాడుకోవాలి. భారతావనిలో ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యల పర్వానికి ఇకనైనా తెరదించాలి....!




# రక్తం తాగుతున్న రహదారులు

ప్రపంచం మొత్తాన్ని గడగడలాడించిన మహమ్మారి కరోనా. ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షలమంది ప్రాణాలని బలిగొన్న మాయలమారి కోవిడ్-19.

అంతటి భయంకరమైన వ్యాధి సైతం 140కోట్ల జనాభా వున్న భారత దేశాన్ని భయపెట్టిందే తప్ప ఊహించిన స్థాయిలో బాధపెట్టలేదు.

ప్రభుత్వం చెప్తున్న గణాంకాల ప్రకారం ఇప్పటివరకు కరోనా బారినపడి మరణించిన వారి సంఖ్య 5,33,570 (అయిదు లక్షల ముప్పై మూడు వేల అయిదువందల డెబ్బై మంది) అని తేల్చారు. ఇవి ప్రభుత్వం దృష్టికి వచ్చినవి మాత్రమే.

నూట నలభై కోట్ల జనాభా వున్న దేశంలో నాలుగేళ్ల వ్యవధిలో కరోనా పొట్టన పెట్టుకుంది కేవలం ఐదులక్షల ముప్పై వేలంటే ఆ మహమ్మారిని మన దేశం సమర్థవంతంగా కట్టడి చేసినట్లే. కరోనాని కట్టడి చేయడంలో మోడీ నాయకత్వంలోని భారత ప్రభుత్వం చేపట్టిన చర్యలని ప్రపంచ దేశాలు సైతం ప్రశంసించడం గమనార్హం.

అయితే, కరోనాని మించిన అత్యంత భయంకరమైన 'ప్రమాదం' అనే 'భూతం' ఇప్పుడు భారతదేశాన్ని పట్టి పీడిస్తోంది. ఏడాదికి సగటున 1,65,000 (లక్షా అరవై అయిదు వేల) ప్రాణాలని ఈ పెను భూతం రాక్షసంగా హరిస్తోంది.

నాలుగేళ్ల కాలంలో.. అంటే, 2020 నుంచి 2024 వరకు కరోనా బారిన పడి 5,33,000 మంది ప్రాణాలు వదిలారు. అంటే, ఏడాదికి సుమారుగా 1,33,000 (లక్షా ముప్పై మూడు వేలు) మంది. కానీ, ప్రమాదాల బారిన పడి చనిపోతున్న వారి సంఖ్య ఏడాదికి 1,65,000. అంటే నాలుగేళ్లకి 6,60,000 మంది. ఇది గమనిస్తే.. ప్రమాదాలన్నవి కరోనా కంటే ఎంత తీవ్రమైన మహమ్మారులో స్పష్టంగా అర్థమైపోతుంది.

భారతదేశంలో కొన్ని లక్షల కిలోమీటర్ల ప్రధాన రహదారులు ఉన్నాయి. కొన్ని కోట్ల వాహనాలు వాటిపైన ప్రయాణిస్తున్నాయి. అంతే స్థాయిలో ప్రతి ఏటా లక్షలాదిమంది ప్రాణాలు కూడా ఈ రహదారులకి బలైపోతున్నాయి.

అతిపెద్ద వ్యవస్థగా అవతరించిన రవాణా వ్యవస్థకి ఈ పరిణామాలు పెను సవాలుగా మారుతున్నాయి. కేవలం మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్న ఘోర ప్రమాదాలను అరికట్టడానికి కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వ శాఖలు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాయి.

అయినా...

జనంలో మార్పు రావడం లేదు. ప్రమాదాల పట్ల అవగాహన కలగడం లేదు. తమ ప్రాణాలని తామే తీసుకుంటున్నామన్న స్పృహ లేదు.

వాహనాల వేగం తగ్గించడం లేదు. సీటు బెల్టులు పెట్టుకోవడం లేదు.

హెల్మెట్లు ధరించడం లేదు. సెల్‌ఫోన్‌లలో మాట్లాడడం మానడం లేదు.

నిద్రొస్తున్నా డ్రైవింగ్ చేయడం ఆపడం లేదు. అడ్డంగా దూరి ఎదురు లైన్లలోకి రావడం ఆగడం లేదు. ప్రమాదాల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు.

దేశవ్యాప్తంగా నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

చిన్నపాటి నిర్లక్ష్యంతో అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోతూనే ఉన్నాయి.

హృదయ విదారక దృశ్యాలు రహదారులపై దర్శనమిస్తూనే ఉన్నాయి.

ప్రభుత్వం చెప్తున్న లెక్కల ప్రకారం 2022 వరకూ తీసిన గణాంకాలు గమనిస్తే భారతదేశంలో ఏడాదికి 4,60,000(నాలుగులక్షల అరవై వేలు) రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో 1,52,000 ప్రమాదాలు జాతీయ రహదారులపైనా, 1,06,000 రాష్ట్ర రహదారులపైనా, 2,02,000 ప్రమాదాలు ఇతర మార్గాల్లో జరుగుతున్నాయి.

వీటిలో అధిక శాతం మానవ తప్పిదాల వల్ల జరుగుతుంటే... కొద్ది శాతం మాత్రమే వ్యవస్థలోని లోపాల వల్ల జరుగుతున్నాయి. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రమాదాల పట్ల అవగాహన కల్పిస్తూ ఎన్ని ప్రచార కార్యక్రమాలు చేపట్టినా అవన్నీ బూడిదలో పోసిన పన్నీరే అవుతున్నాయి.

## గట్టి చట్టాలు తేవాలి... శిక్షలు కఠినతరం చేయాలి!

మితిమీరిన వేగంతో వాహనాలని తోలడం. సెల్‌ఫోను మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం. తొందరగా వెళ్లాలనే తపనతో జాతీయ రహదారులలో సైతం రాంగ్ రూటులో ప్రవేశించడం. నిద్రొస్తున్నా ఆగకుండా ప్రయాణం చేయడం. హెల్మెట్లు ధరించకపోవడం. ఇవన్నీ మనుషులు చేస్తున్న తప్పులే. తాము చేస్తున్న తప్పిదాలవల్ల కొంతమంది తామే బలైపోతుంటే, కొన్ని సంఘటనలలో ఎదుట వారి నిర్లక్ష్యం ఫలితంగా ఏ పాపం ఎరుగని అమాయకులు బలైపోతున్నారు. వందలమంది ప్రాణాలు కోల్పోతుంటే వేలాదిమంది వికలాంగులుగా మారుతున్నారు. ఎంతోమంది చిన్నారులు తమ అమ్మా, నాన్నలని కోల్పోతున్నారు. కొన్ని వందల కుటుంబాలు అనాధలుగా మిగిలిపోతున్నాయి.

ప్రమాదాల విషయంలో చట్టాలలో మార్పులు చేయాలి. గట్టి చట్టాలు తేవాలి. ప్రమాద తీవ్రతని బట్టి, ఆ ప్రమాదానికి కారణమైన వారికి కఠినశిక్ష పడేలా తీర్పులు ఉండాలి.

## తరగతులలో పాఠ్యాంశాలుగా పెట్టాలి!

ప్రమాదాల పట్ల అవగాహన కలిగేలా ప్రభుత్వాలు మరిన్ని చర్యలు చేపట్టాలి. సినిమాల్లో, సినిమా హాళ్లలో, టీవీలలో మద్యపానం, ధూమపానం, గుట్కా, ఖైనీల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నట్లుగా ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను కూడా వివరిస్తూ ప్రచారం చేపట్టాలి.

పాఠశాలల స్థాయి నుండే ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తూ పాఠ్యాంశాలు రూపొందించాలి. కర్కశ రాకాసుల్లా ప్రజల ప్రాణాలు మింగేస్తున్న ప్రమాదాల పట్ల చిన్ననాటి నుండి చైతన్యం తేవాలి. ప్రాణం విలువని తెలియజేస్తూ పాఠాలు ప్రవేశపెట్టాలి. ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అన్న విషయం తరచూ గుర్తుకు తెచ్చేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. 'మన ప్రాణాలు మన చేతుల్లోనే' అన్న భావన కలిగేలా ప్రజలని మేల్కొలపాలి. రహదారుల రక్తదాహాన్ని మనమే అడ్డుకోవాలి..!

- రాజశ్రీ

# శ్రీసిటీ లాంటి పారిశ్రామిక వాడలు రావాలి!

తమిళనాడు నుండి తడ మీదగా మన రాష్ట్రంలోకి వచ్చేటప్పుడు రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో శ్రీసిటీ పారిశ్రామికవాడ కార్యకలాపాలు చూస్తుంటే సంతోషం కలుగుతుంది. వేలాదిమంది ఉద్యోగులు, కార్మికుల రాకపోకలతో శ్రీసిటీ ప్రాంతం ఉదయం, సాయంత్రం వేళల్లో సందడిగా కనిపిస్తుంది. శ్రీసిటీ వేదికగా అంతర్జాతీయ పరిశ్రమలు మనదేశానికి వస్తున్నాయి, లక్షల కోట్లు పెట్టుబడులుగా మన రాష్ట్రానికి వస్తున్నాయి. కోట్లరూపాయలు టాక్సుల రూపంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి వసూలవుతున్నాయి. వేలాదిమందికి జీవనోపాధి కలుగుతోంది. తడ పరిసర ప్రాంతాలలో అభివృద్ధి కళ్ళకి కట్టినట్లుగా కనిపిస్తోంది. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే ఇలాంటి పారిశ్రామికవాడలు ఇంకా రావాలి. వేల కోట్లల్లో పెట్టుబడి పెట్టగలిగే సామర్థ్యం ఉన్న ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలను శ్రీసిటీని సందర్శించేలా చేసి, వారికి ఇలాంటి ప్రత్యేక పారిశ్రామిక మండళ్ళ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించగలిగితే వాటి ప్రాధాన్యత రేపటితరం వారికి అర్థమవుతుంది. పెట్టుబడిదారుల సదస్సులు విశాఖపట్టణం లాంటి మహా నగరాలలో కాకుండా ఇలాంటి నిజమైన అభివృద్ధి చెందిన ప్రదేశాలలో నిర్వహిస్తే అర్థం పరమార్థం రెండూ లభిస్తాయి!

డి.హరిత - గూడూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

# మంచి రాజధానే... సుపరిపాలనకి వేదిక!

గత వారం మన 'లాయర్'లో "విభజన కష్టాలు తీరేందుకు మార్గం సుగమం" అంటూ రాసిన సంపాదకీయం బాగుంది. అది చదివితే ఇకనైనా రాష్ట్రం బాగుపడుతుందేమో అన్న చిన్న ఆశ కలుగుతోంది. పచ్చగా కలిసి వున్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ అధినేత్రి, ఇటలీ రాణి తన రాజకీయ స్వార్థం కోసం రెండుముక్కలు చేసి పదేళ్ళు దాటిపోయింది. ఆ తరువాత రాష్ట్రాన్ని ఏలిన నేతల చేతిలో రాష్ట్రం అధోగతి పాలయ్యింది. ఓటుకి నోటు కేసులో ఇరుక్కుని కేసీఆర్ భయానికి తెలంగాణ నుండి ఆంధ్రాకి వచ్చేసిన చంద్రబాబు 2014 -19 మధ్య కాలంలో తాత్కాలిక కట్టడాలతో, సినిమా సెట్టింగులతో అయిదేళ్ల సమయాన్ని వృథా చేశారు. ఆ తరువాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అసలు రాజధానే లేకుండా పుణ్యం కట్టుకున్నాడు. పదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రం బహుశా ప్రపంచంలో ఆంధ్రా ఒక్కటే ఉంటుందేమో. ఇప్పుడు పరిస్థితులన్నీ సానుకూలంగా ఉన్నాయి. తెలంగాణలో చంద్రబాబు మిత్రుడే ముఖ్యమంత్రిగా ఉన్నాడు. కేంద్రంలో చంద్రబాబు సహకారంతోనే మోడీకి అధికార పీఠం దక్కింది. రాష్ట్రంలో సైతం కూటమికి 164 స్థానాలు దక్కాయి. శాసనసభలో ఎదురులేదు. ఇప్పుడైనా నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకుని, అద్భుత రాజధాని నిర్మాణానికి పటిష్టమైన చర్యలు చేపడితే బాగుంటుంది. మంచి రాజధాని ఏర్పడితే అది సుపరిపాలనకు వేదిక అవుతుంది. రాష్ట్రంలో పాలన బాగుంటే అది రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుంది.

యం. చంద్రమౌళి - కొత్తఢిల్లీ.

# ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## - అధికారులకు కొత్త కలెక్టర్ ఆనంద్ ఆదేశం




ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి ప్రజలు ఇచ్చే అర్జీలను పరిశీలించి, వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలని కొత్త కలెక్టర్ ఓ. ఆనంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఈనెల15న నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఇఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూశాఖకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయని అంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చిన అర్జీలను, సరైన కారణం లేకుండా తిరస్కరించకూడదని చెప్పారు. జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యసిబ్బంది కృషిచేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేని పురస్కరించుని పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. ప్రతి సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి పద్మావతి, జిల్లా పంచాయతి అధికారి సుస్మిత, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఇఓ రామారావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

# కమిషనర్ సంతకాలనే ఫోర్జరీ చేసినా పట్టించుకోరా?

## - ఇకనైనా విచారణ జరిపించాలన్న న్యాయవాది కాకు మురళీరెడ్డి



నెల్లూరు నగరపాలక సంస్థలో కమిషనర్ సంతకాలనే ఫోర్జరీ చేసినా పట్టించుకోరా?..అంటూ ప్రముఖ న్యాయవాది కాకు మురళీరెడ్డి ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో ఆక్యుపేషన్ సర్టిఫికెట్, మార్టుగేజ్‌కి సంబంధించిన ఫైళ్ళలో కమిషనర్ సంతకాలను ఎవరో ఫోర్జరీ చేసి కోట్లాది రూపాయలు దండుకున్నారనే ఆరోపణల నేపథ్యంలో, ఈనెల 17న ఆయన నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశం పెట్టి ఈ విషయంపై మాట్లాడారు. ఈ వ్యవహారంలో అప్పటి కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ స్వయంగా గతంలో జిల్లా ఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసినా కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయకపోవడం ఏమిటని ఆయన అన్నారు. సాధారణ పౌరులు ఫిర్యాదుచేస్తేనే వెంటనే ఎఫ్ఐఆర్‌ను నమోదుచేస్తున్న ఈ రోజుల్లో, సాక్షాత్తూ ఒక న్యాయవాదిగా తాను చేసిన ఫిర్యాదుపై కమిషన్ ప్రాథమిక విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీని కోరినా నేటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దేనికి సంకేతమని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇకనైనా ఆ ఫిర్యాదుపై విచారణ వేగవంతం చేసి చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించాలని ఆయన కోరారు.

# ఆగని చికెన్ వ్యర్థాల జోరు

## - సంగం మండలంలో మరో వాహనం పట్టివేత -



జిల్లాలో చికెన్ వ్యర్థాల వాహనాల జోరు నానాటికీ పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడమే లేదు. సంగం మండలంలోని అరవపాలెం వద్ద ఇటీవల మరో చికెన్ వ్యర్థాల వాహనాన్ని మత్స్యశాఖ అధికారులు, ఎస్ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. భారీస్థాయిలో 23 డ్రమ్ముల్లో ఉన్న ఆ కోళ్ల వ్యర్థాలను గుర్తించి వాటిని తీసుకువెళ్ళి ఊరికి దూరంగా జేసీబీతో గుంటలు తీసి పూడ్చిపెట్టారు. ఈ మండలంలో నిత్యం పెద్దసంఖ్యలో చికెన్ వ్యర్థాల వాహనాలు వస్తుంటాయని, వాటిని చేపలగుంటల్లో చేపలకు ఆహారంగా వేస్తున్నారని స్థానికులు తెలిపారు. ఆ వ్యర్థాలను తిన్న చేపలు బాగా బరువు పెరిగి లాభాలు తెస్తాయన్న దురాశతో యజమానులు వాటిని తీసుకువస్తున్నారని, గబ్బు కొడుతున్న ఆ వ్యర్థాల వాహనాల వల్ల దారిపొడవునా దుర్గంధం భరించలేకపోతున్నామని వారు చెప్తున్నారు. సంగం మండలంలోని దువ్వూరు, అరవపాళెం, వంగల్లు తదితర ప్రాంతాల్లో చేపలగుంటల యజమానులు టన్నులకొద్దీ అలాంటి వ్యర్థాలను తీసుకువచ్చి చేపలను పెంచుతుండడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చి, సంగం మండలాలకు ఇంతపెద్దఎత్తున చికెన్ వ్యర్థాలు వస్తున్నా, చెక్‌పోస్టుల వద్ద ఉన్న అధికారులు వీటిని ఎందుకు నియంత్రించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి చికెన్ వ్యర్థాల వాహనాలను అరికట్టాలని, చేపలగుంటల్లో వ్యర్థాలను వేసి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న చేపలగుంటల యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## రంగనాథునికి

# బంగారు గరుడసేవ

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా నెల్లూరులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవాలయంలో స్వామివారికి బంగారు గరుడసేవ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి 108 లీటర్ల పాలతో తిరుమంజనసేవలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు, ఇఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## 'అరుణాచలం' క్షేత్రానికి..

# ఆత్మకూరు నుంచి ప్రత్యేక బస్సు

ఈనెల 21వ తేదీ గురుపౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు ఆర్టీసీ వారు ఆత్మకూరు నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును ఏర్పాటుచేశారు. ఈ బస్సు ఈనెల 20వ తేది ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుండి బయలుదేరుతుందని, అరుణాచలంకు రానుపోను టిక్కెట్ ధర రూ.1400గా నిర్ణయించామని డిపోమేనేజర్ తెలిపారు. ఈ బస్సులో అరుణాచలం వెళ్ళేవారికి మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, గిరిప్రదర్శనం దర్శనాలు ఉంటాయని, భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# పెన్షనర్ల సమావేశం..20న

రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల పెన్షనర్ల సర్వసభ్య సమావేశం ఈనెల 20వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు నెల్లూరు టౌన్‌హాలుని వర్ధమాన సమాజం హాలులో నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఐ.లక్ష్మీనారాయణ, పి.వెంకయ్య ఈనెల 18న ఒక ప్రకటనలో తెలిపారు. కార్యవర్గ సభ్యులు, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

# వాటర్‌కూలర్ వితరణ

పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం నిత్యాన్నదాన సత్రానికి కలువాయి మండలం, మాదన్నగారి పల్లెకు చెందిన పోతినేని వెంకటేశ్వర్లు - స్వర్ణ దంపతులు ఈ నెల 17న వాటర్ కూలర్‌ను వితరణగా అందజేశారు.

## బారాషహీద్ దర్గాలో..

# భక్తిశ్రద్ధలతో 'సందల్‌మాలి'



పవిత్రమైన నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండుగ సందర్భంగా తొలిరోజు జరిగిన 'సందల్‌మాలి' కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్థానిక మతపెద్దలు ఈనెల 17వ తేది రాత్రి 10 గంటలకు దర్గాలోని అమరవీరుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. 12 మంది వీరుల(బారా షహీద్‌లు) సమాధులను పన్నీరుతో పరిశుభ్రం చేశారు. సంప్రదాయబద్ధంగా గంధలేపనం చేసి, గలేఫాలు.. చద్దర్లు కప్పి భక్తిశ్రద్ధలతో 'సందల్‌మాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు.

### తొలిరోజే లక్షమందికి పైగా భక్తులు :

రొట్టెల పండుగ సందర్భంగా బారాషహీద్ దర్గాకు తొలిరోజైన బుధవారం ఈనెల 17న కనీసం లక్షమందికి పైగానే భక్తజనం వచ్చి దర్గాను దర్శించారని అంచనా. కోర్కెలు తీరాలంటూ భక్తులు ఉద్యోగ రొట్టె, పెళ్ళిరొట్టె, ఆరోగ్య రొట్టె..ఇలా తమ కోర్కెల మేరకు స్వర్ణాల చెరువులో దిగి, ఆ కోర్కెలు తీరిన భక్తుల నుంచి రొట్టెలను అందుకున్నారు. కోర్కెలు తీరితే మళ్ళీ దర్గాకు వచ్చి మొక్కులు తీర్చుకుంటామని మొక్కుకున్నారు. అధికారులు భక్తులకు వసులుబాటు కోసం ఆయా కోర్కెల రొట్టెలు పట్టుకునేవారికి ఇబ్బందిలేకుండా, ఆ కోర్కెల పేరుతో ప్రత్యేక ఘాట్‌లు ఏర్పాటుచేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని, పలువురు న్యాయమూర్తులు, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ తదితరులు తొలిరోజున దర్గాను దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఎప్పటి కప్పుడు భక్తుల వసతులపై పోలీసు అధికారులను ఆరాతీస్తూ, దర్గాను పర్యవేక్షించారు. అదనపు ఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# దొంగల దెబ్బకు హడలెత్తిపోతున్న జిల్లా

- వరికుంటపాడులో వరుస చోరీలు
- ఉదయగిరి, అల్లూరులలో దొంగతనాలు

జిల్లాలో దొంగల బెడద పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఈనెల 17న మండలకేంద్రమైన వరికుంటపాడులో దొంగలు వీరంగం సృష్టించారు. రాత్రివేళ మాటువేసి ఎక్కడ వీలైతే అక్కడంతా దొంగతనాలు చేశారు. నాగార్పమ్మ దేవాలయంలో హుండీని అపహరించకుపోయి, దూరంగా తీసుకువెళ్ళి పగులగొట్టి అందులో ఉన్న నగదునంతా తీసుకుపోయారు. ఊళ్ళోకి వచ్చి యాదగిరి మాల్యాద్రి అన్వేక్షికి చెందిన మోటార్‌బైక్‌ను దర్జాగా వేసుకుపోయారు. ఇళ్ళల్లోకి జొరబడి ఒక ఇంట్లో సెల్‌ఫోన్‌ను, మరో ఇంట్లో 8వేల రూపాయలను, ఇంకో ఇంట్లో రూ.20 వేలు ఇలా ఎంతదొరికితే అంత దోచుకుపోయారు. ప్రజల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి దొంగలకోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### ఉదయగిరిలో దొంగల జోరు :

ఉదయగిరిలో దొంగల జోరు పెరిగిపోయింది. అగ్రహారం వీధిలో ఓ ఇంటిపై కన్నేశారు. ఈనెల 17వ తేదీ రాత్రి ఆ ఇంటియజమాని మహమ్మద్ రియాజ్ తన కుటుంబంతో కలసి దాసరిపల్లికి వెళ్ళి ఉండగా, దొంగలు గమనించి రాత్రికిరాత్రే ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఇంట్లోకి వెళ్ళి, బీరువా లాకర్‌లో ఉన్న రూ.20వేల రూపాయలు, ఓ బంగారు ఉంగరంతో పాటు, జత బంగారు కమ్మలు అపహరించుకుపోయారు. పక్కరోజు ఇంటికి తిరిగివచ్చిన రియాజ్ వచ్చి చూసుకునే సరికి ఇంటి తలుపులు, బీరువా ధ్వంసమై ఉన్నాయి. లబోదిబోమంటూ ఆయన పోలీసులకు ఫిర్యాదుచేయడంతో పోలీసులు వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### అల్లూరులో భారీ చోరీ :

మండల కేంద్రమైన అల్లూరులో పేటకు చెందిన వల్లపోలు శ్రీనివాసులురెడ్డి ఇంట్లో ఇటీవల దొంగతనం జరిగింది. ఆయన కుటుంబసభ్యులతో కలిసి తిరుమలకు వెళ్ళగా, దొంగలు ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో బీరువాలోని 15 సవర్ల బంగారునగలు, లక్షా 75వేల రూపాయలు దోచుకుపోయారు. శ్రీనివాసులురెడ్డి ఇంటికి వచ్చి చూసుకునేసరికి, దాచుకున్న డబ్బు, బంగారమంతా దొంగలు కాజేశారు. బాధితుడు గోడుగోడుమంటూ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో, ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి వచ్చి సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

# నెల్లూరు కబుర్లు

## రొట్టెల పండుగ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం



నెల్లూరు బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ కమిటీ ప్రమాణ స్వీకారమహోత్సవం ఈనెల 14న ఘనంగా జరిగింది. ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు డాక్టర్ పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులకు దర్గాకమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా రొట్టెల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం 70 మంది దర్గా కమిటీ సభ్యులచే మంత్రులు ప్రమాణ స్వీకారం చేయించారు.

### సేవకులుగా పనిచేయాలి - ఎంపీ వేమిరెడ్డి

కమిటీ సభ్యులు దర్గాకు తరలివచ్చే భక్తులకు సేవకులుగా పనిచేయాలని, వారికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తితో చేసే సేవకు అల్లా ఆశీస్సులు తప్పకుండా ఉంటాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) చెప్పారు. ఈ పండుగకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. జిల్లా టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కోర్ కమిటీ సమావేశం



జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సూచనలతో, పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, నెల్లూరు జిల్లా పర్యవేక్షకులు వేములపాటి అజయ్ కుమార్ సూచనలతో 15 మందితో ఏర్పాటు చేసిన కోర్ కమిటీ సమావేశం ఇటీవల నెల్లూరులో జరిగింది. స్థానిక గోమతినగర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఆ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు మరియు డివిజన్ నాయకుల పరిచయ కార్యక్రమం అనంతరం, జనసేన క్రియాశీలక సభ్యత్వం, భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యాలయం ఇన్‌చార్జ్ జమీర్, కోర్ కమిటీ సభ్యులు నూనె మల్లికార్జునయాదవ్, గునుకుల కిషోర్, కృష్ణారెడ్డి, రవి, నాగరత్నంయాదవ్, జెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, శ్యామ్, చదలవాడ రాజేష్, శ్రీరామ్, శ్రీపతి రాము పాల్గొన్నారు.

## విజయసాయిపై.. సీబీఐ విచారణ జరపాలి

### - టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్



'రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఆయన భార్య సునంద, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మదన్‌మోహన్‌రెడ్డిలకు సంబంధించిన వ్యవహారంలో 1.6 కోట్ల రూపాయలు చేతులుమారాయనే ఆరోపణలను నిగ్గుతేల్చేందుకు సీబీఐ విచారణ చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 16న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగికి, ఒక ఎంపీ అంత డబ్బు ఇచ్చారంటే నేరానికి పాల్పడినట్లే కదా అని ఆయన అంటూ, ఈ విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయసాయి డీఎన్ఏ టెస్టుకు ఎందుకు ఒప్పుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. విశాఖలో భూదందాకు పాల్పడి, ఒక ఎస్టీ మహిళను పావుగా వాడుకున్నారని, ఆ మహిళ రోడ్డెక్కడానికి కూడా కారణం విజయసాయిరెడ్డేనని ఆయన ఆరోపించారు. తాను నెల్లూరు వాడినని చెప్పుకునే విజయసాయి, విశాఖలో విలేకర్ల సమావేశం పెట్టడంలో అర్థమేమిటో చెప్పాలన్నారు. షరతులపై కూడిన బెయిల్‌పై తిరుగుతున్న విజయసాయి, అలాగే బయట ఉంటే జనాన్ని భయపెట్టే పరిస్థితి వస్తుందని, వెంటనే ఆయన బెయిల్‌ను రద్దుచేయాలని ఆనం డిమాండ్ చేశారు.


## కాంగ్రెస్ నాయకుల సంబరాలు



దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన 13 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో 10 స్థానాల్లో 'ఇండియా కూటమి' ఘన విజయం సాధించడం పట్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధించడంతో నెల్లూరులోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా రాహుల్‌గాంధీ సారధ్యంలో కాంగ్రెస్‌పార్టీ అనేక విజయాలను సాధిస్తోందన్నారు. నాయకులు వి.వెంకట్రావు, శ్రీనివాసులురెడ్డి, సిటీ ఇన్‌చార్జ్ ఫయాజ్, తిరుపయ్య, కె.సంజయ్‌కుమార్, మోహన్‌రెడ్డి, హుస్సేన్ బాషా, మోహన్, గణేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

## రహదారి భద్రతలో జాగ్రత్తలు పాటించాలి

### సీనియర్ సివిల్‌జడ్జి వాణి




వాహనాలు నడిపేవారు డ్రైవింగ్‌లో జాగ్రత్తలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి వాణి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని జిల్లా రవాణా కార్యాలయంలో జరిగిన రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడుతూ, ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు బైక్ నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ హెల్మెట్లు కూడా నాణ్యమైనవిగా ఉండాలని సూచించారు. అతివేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలు జరగకుండా చూడాలని చెప్పారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సి.యామిని ఆదేశాల మేరకు రహదారి భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతలపై ఈ సదస్సులో అవగాహన కలిగించారు. 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అఖిల మాట్లాడుతూ, వాహనదారులు డ్రైవింగ్‌ను సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. న్యాయమూర్తులు తమ వృత్తిలో పూర్తిగా నిమగ్నమైనప్పటికీ, తమ అమూల్యమైన సమయాన్ని రహదారి భద్రతకు సంబంధించిన అవగాహన కలిగించేందుకు కృషి చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో రహదారి భద్రతకి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప రవాణా కమిషనర్ చందర్ అన్నారు. రహదారి భద్రత విషయంలో వాహనదారులు నిబంధనలు పాటించాలని, ఎక్కడా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. కావలి, సూళ్ళూరు పేట అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్ సింహ, అనూష, ఇన్‌చార్జి ప్రాంతీయ రవాణా అధికారి మురళీమోహన్, మోటార్ వాహన తనిఖీ అధికారులు బాలమురళీకృష్ణ, పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, విఘ్నేశ్వరలాల్, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

## శంకరమఠంలో..21న చండీహోమం

నెల్లూరు మూలాపేటలోని శంకరమఠం ప్రాంగణంలో కొలువై ఉన్న కామాక్షిదేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 21న అత్యంత వైభవంగా చండీహోమం నిర్వహించనున్నారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని చేపట్టే ఈ హోమంలో పాల్గొనదలచినవారు 96528 60264, 99499 18358 నంబర్లకు సంప్రదించాలని మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్ – ఉషాకుమారి దంపతులు ఒక ప్రకటనలో కోరారు.









శ్రీ షిర్డి సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవ ఆహ్వానము

నెల్లూరు, ట్రంకురోడ్డు, గాంధీనగర్‌లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సాయిబాబా గురుపూర్ణిమ మహోత్సవాలు

తేది. 21-07-2024 ఆదివారం నుండి తేది. 29-07-2024 సోమవారము వరకు జరుగును.

కార్యక్రమ వివరములు:

తేది. 21.7.2024 ఆదివారం నుండి 27.7.2024 శనివారం వరకు ప్రతి రోజు ఉదయం 7-00గం.ల నుండి బాబా వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, మ॥ 12.00 గ॥ల నుండి సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును. పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.250/- చెల్లించి తగు రసీదు పొంది, పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి శ్రీ బాబా వారి కృపకు పాత్రులగుదురని కోరుకుంటున్నాము.

బాబా నగరోత్సవం:

తేది.29-7-2024 సోమవారం సా॥ 6.00 గం॥లకు పుష్పాలంకరణలతో, మంగళవాయిద్యములతో, విద్యుత్‌దీప కాంతులతో, బాణాసంచా వేడుకలతో శ్రీ షిర్డి సాయిబాబా మందిరం నుండి గాంధీబొమ్మ, ట్రంక్‌రోడ్, ఏ.సి.సెంటర్, సంతపేట మండపము, చిన్నబజార్, పెద్దబజార్, బారకాసు, వి.ఆర్.కాలేజ్ సెంటర్, కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మీదుగా తిరిగి నగరోత్సవం శ్రీ షిర్డి సాయిబాబా మందిరానికి చేరును.
తేది : 30.07.2024 మంగళవారం భక్తులకు ప్రసాద వితరణ జరుగును.

ఇట్లు: కార్యవర్గం

శ్రీ షిర్డి సాయిబాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు, నెల్లూరు.

# 'ఉపాధి' పథకాన్నీ దోచేశారు



## వైకాపా నాయకులపై మండిపడ్డ సోమిరెడ్డి

వైకాపా పాలనలో ఉపాధి హామీ పథకాన్ని కూడా నాయకులు దిగమింగేశారని, ఆ పథకంలో భారీ దోపిడీ జరిగినా అధికారులు పట్టించుకోలేదని సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఈనెల 15న సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. మండలాల వారీగా జరిగిన ఉపాధి పనులను ఆరా తీశారు. వైకాపా పాలనలో జగనన్న కాలనీల అభివృద్ధి పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలని స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులు ఈ సందర్భంగా కోరారు. అందుకు స్పందించిన సోమిరెడ్డి, గత అయిదేళ్లుగా సామాజిక తనిఖీలు నిర్వహించకుండానే, తనిఖీలు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేయడం ఏమిటని మండిపడ్డారు. పనులు చేయకుండానే బిల్లులు చేసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే ఉపాధి పథకంలో లెక్కకుమించిన దోపిడీ జరిగిపోయిందని, ఎన్నో అవినీతి అక్రమాలు జరిగాయని సోమిరెడ్డి వైకాపా నాయకుల తీరును దుయ్యబట్టారు. ఇకపై ఇలాంటి దోపిడీలు కుదరవన్నారు. ప్రతి పని పారదర్శకంగా ఉండాలన్నారు. పేదలకు, రైతులకు, రైతు కూలీలకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పనులు జరగాలని అధికారులకు స్పష్టం చేశారు.

### వెంకయ్య సహకారంతో..వెంకటాచలం అభివృద్ధి :

పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సహకారంతో వెంకటాచలం మండలం బాగా అభివృద్ధి చెందుతోందని, ఆయన చొరవతోనే ఈ మండలం ఒక ఎడ్యుకేషన్ హబ్‌గా వెలుగొందుతోందని సోమిరెడ్డి కొనియాడారు. ఈనెల 15న ఆయన వెంకటాచలం మండలం ఎర్రగుంట్ల గ్రామంలో విద్యార్థులకు స్కూల్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. తొలుత ఆయన వెంకయ్యనాయుడు కృషితో ఏర్పాటైన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న సారస్వత పరిశోధనలను, సాహితీ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఆ కేంద్రానికి తనవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# దొడ్ల వారి దాతృత్వం అభినందనీయం

## ❍ కొనియాడిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



దాతలు దొడ్ల రుక్మిణమ్మ–వరదారెడ్డి ట్రస్టు, దొడ్ల పార్థసారథిరెడ్డి, లలితమ్మ ట్రస్టు దాతృత్వంతో బుచ్చిరెడ్డిపాళెంలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి ఎన్నో విధాల సాయం అందిస్తుండడం అభినందనీయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కొనియాడారు. ఆ ఆరోగ్యకేంద్రానికి అత్యాధునిక సీటీజీ మెషిన్ (కార్డియోటోకోగ్రఫీ), దొడ్ల కోదండరామిరెడ్డి సమకూర్చిన ఫిజియోథెరఫి సైకిల్ మరియు బెడ్ స్క్రీన్స్‌లను ఆమె ఇటీవల ప్రారంభించి దాత ఔదార్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరిశీలించి, ల్యాబ్‌లు, ఆసుపత్రిలో వసతులపై ఆరా తీశారు. సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోవూరు నియోజకవర్గంలో ప్రజా వైద్యానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రభుత్వం వైద్య సదుపాయాల కల్పనకు ఎంతో సహకరిస్తుందని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న సుబ్బరత్నమ్మ అనే గర్భిణికి ఆమె రూ.10వేల సాయం అందించారు. దాత దొడ్ల కోదండరామిరెడ్డి, నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ బుచ్చి నగర అధ్యక్షులు ఎంవీ శేషయ్య, రూరల్ అధ్యక్షులు బత్తల హరికృష్ణ, ఎంపీడీఓ రాజేశ్వరి, వైద్యాధికారి పద్మావతి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఆనంను కలసిన.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఈనెల 13న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆయన నివాసంలో కలిసి కోవూరు నియోజకవర్గం అభివృద్ధి విషయమై సుదీర్ఘంగా చర్చించారు. కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.









జననం : 23.06.1936

నిర్యాణం : 22.07.2020

# శ్రద్ధాంజలి

నిరంతర సేవాతత్పరులు, నిస్వార్థ ప్రజాసేవకులు,
ఎందరికో స్ఫూర్తిప్రదాతలు, మాకు మార్గదర్శకులు

## డా. చిల్లకూరు మోహన్‌రెడ్డి గారు

పరమపదించి తే. 22.07.2024వ నాటికి
నాలుగేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ మహనీయుని స్మరించుకుంటూ...

తమ్ముడు - మరదలు
**ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**

తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హారిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ**

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అస్మిత     కీర్తన లక్ష్మి & తనవ్**

# ఎట్టకేలకు సోమశిల డ్యామ్ బాగుకు.. రంగంలోకి దిగిన కొత్త ప్రభుత్వం

## • 60 రోజుల్లో ఆఫ్రాన్ నిర్మాణం పూర్తికి యాక్షన్ ప్లాన్



ఎట్టకేలకు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక కానీ, జిల్లాకు ప్రాణప్రదమైన సోమశిల జలాశయం బాగుకు చర్యలు తీసుకోవడం ప్రారంభం కాలేదు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతాంగం ఎన్నిసార్లు విజ్ఞాపనలు చేసుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో ఇక సోమశిల గతి ఇంతేనని అందరూ అనుకుంటున్న నేపథ్యంలో, టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఆ పనులకు ప్రతిపాదనలు సిద్ధమవుతుండడం విశేషం. ఇటీవల జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలతో కలసి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలను సందర్శించారు. 2021లో వరదలకు దెబ్బతిన్న సోమశిల ఆఫ్రాన్‌ను పరిశీలించారు. జలాశయం పై భాగంలో డ్యాం పరిస్థితులు, నీటి నిల్వ సామర్థ్యం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మంత్రులకు వివరించారు. అనంతరం, మంత్రి నిమ్మల విలేకర్లతో మాట్లాడుతూ, ప్రతి రైతుకు మేలుచేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే ఇరిగేషన్ ప్రాజెక్టులను పరిశీలించి అభివృద్ధి పనులను మొదలుపెట్టేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గత ప్రభుత్వం సోమశిల జలాశయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో దీంతో రైతులు చాలా నష్టపోయారని, వరదలకు దెబ్బతిన్న సోమశిల ఆఫ్రాన్ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో డ్యామ్ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అంటూ, కనీసం షట్టర్లు, గేట్లు, రోప్స్ వంటి చిన్న చిన్న మరమ్మత్తులను కూడా గత ప్రభుత్వం చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, సర్వేపల్లి, కావలి, ఉదయగిరి, కందుకూరు, గూడూరు, సూళ్లూరుపేట శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, చీఫ్ ఇంజనీర్ డి.రామ్ గోపాల్, సోమశిల, కండలేరు, తెలుగు గంగ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

### రెండు నెలల్లోనే ఆఫ్రాన్ నిర్మాణం - మంత్రి నిమ్మల



జలాశయాలను కాపాడుకోవాలనే బాధ్యతతో తక్షణమే తమ ప్రభుత్వం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించిందని, రెండు నెలల్లోనే సోమశిల ఆఫ్రాన్ నిర్మాణాన్ని పూర్తిచేయాలని నిర్ణయించామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమశిల జలాశయం వద్ద రోప్స్ మరమ్మత్తులు లేదా రీప్లేస్మెంట్ వెంటనే చేపట్టాలని, కండలేరు జలాశయం వద్ద దెబ్బతిన్న మట్టికట్ట మరమ్మతులు కూడా చేపట్టాలని అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో ఈ మూడు ప్రాజెక్టుల పరిధిలో సుమారు 70 నుండి 80కోట్ల రూపాయల వ్యయంతో మొదటిదశలో ప్రాధాన్యత పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, ముఖ్యమంత్రితో చర్చించి నిధులు మంజూరు కాగానే పనులు మొదలు పెడతామని, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక్కడి లష్కర్లకు గత ప్రభుత్వం మూడేళ్లుగా జీతాలు చెల్లించడం లేదనే విషయాన్ని కూడా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

### త్వరలోనే భూగర్భ డ్రైనేజీ - మంత్రి నారాయణ

నెల్లూరు నగరంలో త్వరలోనే భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తిచేయిస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర ఖజానా మొత్తం ఖాళీ అయిపోయిందని, ప్రధానంగా పురపాలక శాఖలో సుమారు రూ. 5వేల కోట్లు ఖాళీ అయ్యాయని చెప్పారు. ఆ నిధులు ఉండి ఉంటే...మున్సిపాలిటీ పరిధిలోని రోడ్లు, డ్రైయిన్లు పూర్తి చేసుకోవచ్చన్నారు. తమ ప్రభుత్వం జలాశయాలకు, రైతుల బాగుకు ప్రాధాన్యత ఇస్తోందని, నెల్లూరు నగరంలోని అన్ని ఇరిగేషన్ కాలువలను బాగు చేయిస్తామని, నెల్లూరులో భూగర్భ డ్రైనేజీని కూడా త్వరలోనే పూర్తి చేయిస్తామని, నెల్లూరును స్మార్ట్ సిటీ చేయడమే తమ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## మంత్రులను కలసిన ఎమ్మెల్యే పాశం



నెల్లూరుజిల్లా పర్యటనకి విచ్చేసిన రాష్ట్ర జనవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ నెల 14న మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు. గూడూరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసేలా సహకరించాలని కోరారు. అలాగే రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణలను మర్యాదపూర్వకంగా కలసి నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించారు.

## బాధ్యులపై చర్యలు తీసుకుంటాం - మంత్రి డోలా



ఇటీవల విషాహారం తిని అస్వస్థతకు గురై గూడూరు ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాలవీరాంజనేయస్వామి, తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటుచేసి నిర్లక్ష్యం వహించి, పిల్లల అస్వస్థతతకు బాధ్యులైనవారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

## వైభవంగా జగన్నాథ రథయాత్ర



గూడూరు పట్టణంలో జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా జగన్నాథ రథయాత్ర పురవీధుల్లో కొనసాగుతుండగా భక్తులు వేలాదిగా తరలివచ్చి జగన్నాథుని దర్శించి తరించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం రెండు గంటలకు గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న నారాయణమ్మ తల్లి దేవస్థానం వద్ద జగన్నాథ రథయాత్ర ప్రారంభమైంది. భగవన్నామ స్మరణలతో భక్తులు తన్మయత్వంలో మునిగి రథాన్ని లాగారు. భక్తులు వారి వారి ఇళ్ళ ముందు రంగురంగుల హరివిల్లులు తీర్చిదిద్ది రథయాత్రకు స్వాగతం పలికారు. రథోత్సవం పొడవునా స్వామివారి ప్రసాద పంపిణీ కార్యక్రమం కొనసాగింది.




## ఇసుకను అందుబాటులోకి తేవాలి

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధాన పాలసీని తీసుకొచ్చినా, పేదలకు దొరకని పరిస్థితి నెలకొందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళీ అన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఈ నెల 14న నియోజకవర్గ స్థాయి కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార యంత్రాంగం దృష్టి సారించి పేదలకు ఇసుక అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, కాలేషా, కుమార్, చల్లా వెంకటేశ్వర్లు, జమాలుల్లా, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



## కమనీయం.. లక్ష్మీనరసింహుని కళ్యాణం

ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి అమ్మవార్లకు ఈ నెల 13న ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో గోవింద నామస్మరణలతో పెంచలకోన క్షేత్రం మారుమోగింది.

## రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం



గూడూరు రోటరీ క్లబ్‌కి 2024-25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ ఎన్నిక ఈ నెల 16న అల్లూరు ఆదిశేషారెడ్డి రోటరీ భవనంలో ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్ పీడీజీ బొమ్మిరెడ్డి సురేంద్ర ఆధ్వర్యంలో జరిగింది. నూతన అధ్యక్షుడిగా బి.వి. శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శిగా జి.గోపాలనాయుడు మరియు కార్యాలయ సిబ్బందిని నియమించారు. బొమ్మిరెడ్డి సురేంద్ర రోటరీ జోన్ 7కి 2025-28 సంవత్సరానికి గాను నూతన ఆర్‌ఆర్‌ఎఫ్‌సిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను నూతన కార్యవర్గం వారు సత్కరించారు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. డి.భరత్‌కుమార్‌రెడ్డి, కె.మునిగిరీష్, వొమ్మిన సతీష్‌బాబు, వాసుగౌడ్, బి.దశరథరామిరెడ్డి, శ్యామసుందరరావు, డా. సి.జనార్ధన్‌రెడ్డి, డా. సి.రోహిణి, రోటేరియన్స్, ఇన్నర్ వీల్ సభ్యులు, పురప్రముఖులు పాల్గొన్నారు.

# అమెరికాపై మరో తుపాకీ మరక..!

జులై 13న అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలో పేలిన ఒక తూటా ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. అమెరికాలో తుపాకుల మోత ప్రపంచానికి కొత్తేమీ కాదు. కానీ ఆ రోజు పేలిన తూటా అమెరికా మాజీ అధ్యక్షుడు, త్వరలో జరగబోయే ఎన్నికల్లో మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్న డొనాల్డ్ ట్రంప్‌ను హతమార్చడానికి పేలింది. ఆ సంఘటన చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. ఎందుకంటే రెండో ప్రపంచ యుద్ధానంతరం నుంచి ప్రపంచాన్ని శాసించే స్థితిలో అమెరికా ఉంది. దేశీయంగా, అంతర్జాతీయంగా ఎంతో పకడ్బందీగా పటిష్టమైన వ్యవస్థలను ఆ దేశం ఏర్పాటు చేసుకుంది. ప్రపంచంలో ఏ మూల చీమ చిటుక్కుమన్నా తెలిసిపోయే అమెరికాకు మాజీ అధ్యక్షుడిపై హత్యాయత్నం సంగతి, అందులోనూ స్థానికుడి నుంచి దాడి జరిగే అవకాశం గురించి తెలియకపోవడం ఆశ్చర్యం కలిగించింది. ట్రంప్‌ను హతమార్చడానికి ఇరాన్ ప్రయత్నిస్తోందన్న సమాచారం కూడా తెలిసిన అమెరికా స్థానికుడి నుంచి ముప్పు పొంచి ఉందన్న సంగతిని గ్రహించలేక పోవడం విస్మయం కలిగిస్తోంది. ఆ సభకు వచ్చిన ఒక వ్యక్తి... దుండగుడి అనుమానాస్పద కదలికల గురించి భద్రత అధికారులకు చెప్పినా పట్టించు కోలేదని వార్తలు వచ్చాయి. ఇంత బతుకు బతికీ..., 'తాను తీసిన గోతిలో తానే పడినట్లు' అనే సామెతలను ఈ ఉదంతం గుర్తు చేసింది. ట్రంప్ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

## పాతుకుపోయిన తుపాకీ సంస్కృతి!

ఈ హత్యాయత్నానికి తక్షణ కారణం ఏదైనా దానికి మూలం మాత్రం అమెరికాలో పాతుకుపోయిన తుపాకీ సంస్కృతే. తుపాకులు అమెరికా పౌర సంస్కృతిలో భాగం. పౌరులు తుపాకులను కలిగి ఉండే హక్కుని, అమెరికా రాజ్యాంగం రెండో సవరణ కల్పించింది. "స్వేచ్ఛాయుత రాజ్య రక్షణకు క్రమబద్ధమైన సాయుధ బృందాల అవసరం ఉంది. అందుకే పౌరుల తుపాకీ హక్కుల్లో జోక్యం ఉండరాదు." అని ఈ సవరణ పేర్కొంది. ఈ సవరణకు రకరకాల భాష్యాలు చెబుతున్నా మొత్తం మీద తుపాకీ కల్చర్ ఉండే హక్కుకు ఈ రాజ్యాంగ సవరణ బాసటగా ఉంది. అంతర్యుద్ధ సమయంలో, అంతకుముందు స్థానిక తెగలతో జరిగిన పోరాటాల సమయంలో వివిధ కాలనీలు(రాష్ట్రాలు) తుపాకులను అనుమతిస్తూ రూపొందించుకున్న నిబంధనలే ఈ రాజ్యాంగ సవరణకు మూలం. తుపాకుల సంస్కృతి ఎంతలా అమెరికా జీవనంలో పెనవేసుకుపోయిందో చెప్పడానికి ట్రంప్ పై కాల్పుల సంఘటన సందర్భంగా ట్రంప్, తూటా తగిలి మరణించిన మరో వ్యక్తి తక్షణం అప్రమత్తమైన తీరే నిదర్శనం. దుండగుడు 8 తూటాలను పేల్చినట్లు అమెరికా మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తూటా రెప్ప పాటులో దూసుకెళుతుంది. ఆ రెప్పపాటులోనే ట్రంప్ అప్రమత్తమై పక్కకు జరగడంతో చెవికి గాయం చేసుకుంటూ తూటా దూసుకుపోయింది. సభలో ఉన్న ఓ వ్యక్తి ఒక్క ఉదుటున ముందుకు దూకి తన కుటుంబసభ్యులకు అడ్డంగా నిలబడ్డాడు. దీంతో తూటా అతన్ని బలిగొంది. తూటా చప్పుడు విని ఆత్మరక్షణ కోసం తక్షణం అప్రమత్తమైన తీరును బట్టి కూడా అక్కడి తుపాకీ సంస్కృతిని అర్థం చేసుకోవచ్చు. అమెరికాలో దాదాపు కోటి 60లక్షల మంది వద్ద అసాల్ట్ రైఫిల్స్ ఉన్నాయి. ఎప్పుడూ ఏదో ఒక చోట కాల్పులు జరుగుతూనే ఉంటాయి. షాపింగ్ మాల్స్‌లో, థియేటర్లలో, పాఠ శాలల్లో పార్టీల్లో పెద్ద ఎత్తున కాల్పులు జరపడం పరిపాటిగా మారింది. మానసిక ఒత్తిడి, మానసిక సమస్యలున్న వారు కాల్పులకు పాల్పడిన సంఘటనలున్నాయి. 1994లో డెమొక్రటిక్ నేత బిల్ క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అసాల్ట్ రైఫిల్స్ పై నిషేధం విధించారు. ఆ నిషేధం 2004తో ముగిసిపోయింది. అయితే అమెరికా చట్టసభలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో నిషేధాన్ని కొనసాగించలేకపోయారు.

## ట్రంప్ కంటే ముందు...

ట్రంప్ కంటే ముందు అమెరికా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులపై హత్యాయత్నాలు, హత్యలు జరిగాయి. అమెరికా అధ్యక్షులుగా పనిచేసిన అబ్రహం లింకన్, జేమ్స్‌గార్ ఫీల్డ్, విలియమ్ మెక్ కిన్లే, జాన్ ఎఫ్ కెన్నెడీలను దుండగులు వేర్వేరు సంఘటనల్లో తుపాకులతో కాల్చడం వల్లే మరణించారు. రూజ్వెల్ట్, రోనాల్డ్ రీగన్, తాజాగా ట్రంప్ గాయాలతో తప్పించుకున్నారు.

## మూలం ఏమిటి...?

అమెరికాలో తుపాకీ సంస్కృతికి మూలం వనరులపై ఆధిపత్యంతో మొదలయిందని చెప్పవచ్చు. ఐరోపా వ్యాప్తంగా కొన్ని వర్గాల ప్రజలకు ఆస్తిహక్కులను నిరాకరించిన నేపథ్యంలో వేల మంది బతుకుతెరువు కోసం అమెరికాకు వలస బాటపట్టారు. విశాలమైన భూభాగాలు, విలువైన సహజవనరులు వారిని ఆకర్షించాయి. ఇంగ్లీష్, ఫ్రెంచి, స్పెయిన్ నుంచి అమెరికా భూభాగంపైకి వలస వచ్చారు. బ్రిటిష్ సెటిలర్లు అమెరికాకు రావడానికి పలు కారణాలున్నాయి. కొంత మంది అమెరికాలోని వనరులను ఉపయోగించుకుని బ్రిటన్‌తో వాణిజ్యం చేసి సంపాదించుకోవాలని, మరికొంత మంది మత స్వేచ్ఛ కోరుతూ వలస వచ్చారు. బ్రిటిష్ చక్రవర్తి అమెరికాకు వలసలను ప్రోత్సహించాడు. దీంతో 1700 నాటికి అమెరికా తూర్పు కోస్తా వ్యాప్తంగా ఇంగ్లీష్ వారితో 13 కాలనీలు ఏర్పడ్డాయి. ఫ్రెంచి ప్రజలు ఉత్తర ప్రాంతంలో, స్పెయిన్ నుంచి వచ్చినవారు దక్షిణ, పశ్చిమ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వాస్తవానికి ఆ సహజవనరులను స్థానిక తెగలు ఉపయోగించుకుంటూ ఉండేవి. వారినే ఇండియన్లు (భారతీయులు కాదు) లేదా రెడ్ ఇండియన్లు అని పిలుస్తుంటారు. ఈ విధంగా సహజవనరులపై స్థానికులు, కొత్తగా వలసవచ్చిన ఐరోపా ప్రజల మధ్య ఘర్షణ మొదలై యుద్ధాల పరంపరకు దారి తీసింది. తొలుత విల్లంబులు, కత్తులతో యుద్ధం మొదలయినా, తుపాకీ కనుగొన్న తర్వాత అదే ఆయుధంగా మారింది. ముఖ్యంగా ఐరోపా నుంచి వచ్చిన కాలనీలకు తుపాకీ ప్రధాన ఆయుధంగా మారింది. ఆత్మరక్షణకు ఉపయోగించడంతో పాటు స్థానిక తెగల నుంచి దాడి ప్రమాదం పొంచి ఉందని అనుమానం ఉంటే ముందుగానే వెళ్లి తుపాకులతో విరుచుకుపడడం మొదలయింది. మరోవైపు ఫ్రెంచి వారు, బ్రిటన్లు అమెరికా వనరులపై నియంత్రణకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో రెండు రాజ్యాల మధ్య ఘర్షణ మొదలయింది. ఈ క్రమంలో రెండు రాజ్యాలూ స్థానిక తెగలతో జట్టుకట్టి పరస్పరం యుద్ధాలకు తెగబడ్డాయి. ఈ రకంగా తుపాకీ సంస్కృతి మరింత పెరిగింది. మరోవైపు బ్రిటన్ నుంచి వలసవచ్చి 13 చోట్ల కాలనీలుగా ఏర్పడిన ప్రజలు బ్రిటన్ రాజ్య ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. బ్రిటన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం ఇవ్వకుండా పన్నులు వసూలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. స్వతంత్రత కోరుకున్నారు. తిరుగుబాటు చేశారు. దీంతో 1775 నుంచి 1783 వరకు బ్రిటన్ కాలనీలు– బ్రిటన్ రాజ్యానికి చెందిన సైన్యం మధ్య యుద్ధం జరిగింది. తొలుత ఇది అంతర్యుద్ధంగానే మొదలయినా తర్వాత ఫ్రెంచి వారు బ్రిటన్ సెటిలర్లకు అండగా నిలబడి వారికి సైనిక శిక్షణ, ఆయుధాలు అందజేయడంతో అది అంతర్జాతీయ ఘర్షణగా మారింది. దీన్నే అమెరికా విప్లవం అంటారు. అంతర్యుద్ధానికి ముందు 13 కాలనీలు లేదా రాష్ట్రాలకు వేర్వేరుగా రాజ్యాంగాలుండేవి. అమెరికా విప్లవం మొదలయిన తర్వాత ఈ రాష్ట్రాలన్నీ ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించి ఒక యూనియన్‌గా ఏర్పడ్డాయి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు అప్పుడే బీజం పడింది.

## శక్తిమంతమైన లాబీయింగ్!

నేషనల్ రైఫిల్ అసోసియేషన్ అనేది అమెరికాలో తుపాకీ హక్కును సమర్థించే ప్రభావవంతమైన గ్రూప్. రాజకీయాలను ప్రభావితం చేసే గ్రూప్. తుపాకీ నియంత్రణ నిబంధనలను ఈ గ్రూప్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మరోవైపు తుపాకీలపై నియంత్రణ ఉండాలని, కఠిన నిబంధనలు రూపొందించాలనే గ్రూపులు కూడా ఉన్నాయి. ఆత్మరక్షణ కోసం తుపాకీ అనే స్థాయి నుంచి వ్యాపారం స్థాయి వరకు తుపాకీ సంస్కృతి పెరిగిపోయింది. అక్కడ తుపాకీ అంగడి సరుకు. తుపాకుల వ్యాపారం అమెరికా ఆర్థిక వ్యవస్థలో కీలకం. అందుకే తుపాకులపై నిషేధం లేదా నియంత్రణ అంత తేలికయిన విషయం కాదు. ఆ లాబీయింగ్ చాలా శక్తిమంతమైనది. గొప్ప రాజకీయ సంకల్పం, పౌరసమాజంలో మార్పు వల్లే తుపాకీ సంస్కృతి తగ్గుతుంది. ఆ మార్పు రాగలిగితే అమెరికాకే కాదు ప్రపంచానికే చాలా మంచిది. ఆ మార్పు రావాలని కోరుకుందాం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

---





రాముడిలోని ఒక్కదోషం చెప్పు నీవు! ఏ దోషముందని అడవులకు పంపాలి?

కౌసల్యను, సుమిత్రను, నా సకలైశ్వర్యాలను, రాజ్యాన్ని, చివరకు నా ప్రాణాన్నయినా విడుస్తాను కానీ నా రాముని నేను విడువలేను.

వాడే నాకు పరమానందం, వాడే నాకు బ్రహ్మానందం, వాడే నాకు దివ్యచైతన్యం. సూర్యుడు లేకుండా ఈ ప్రపంచముండవచ్చునేమో! నీరు లేకుండా పంటలు పండవచ్చునేమో కానీ నా రాముడు లేక నా ప్రాణముండదు!.

కైకా! ఇక చాలు! ఈ పాపపు ఆలోచన విడిచిపెట్టు! నాకు భరతుడిపై గల ప్రేమను పరీక్షించడానికి ఇలా మాట్లాడావా!

నీవేకదా రాముడు సకలగుణాభిరాముడు, జ్యేష్ఠుడు... వానికే రాజ్యాధికారముందని నిన్నటిదాకా నాతోపలికెడిదానవు! ఈరోజు నాకేదైనా పరీక్షపెట్టదలిచావా? చెప్పు!.

ఎంతో నీతిసంపన్నురాలవు అనికదా నీకున్న పేరు! ఈరోజు నీ బుద్ధిలో ఈ వికారం ఏల జన్మించింది? పూర్వమెప్పుడూ నీలో రవ్వంత దోషం కూడా నాకు కానరాలేదు! మరి ఈరోజు ఎందుకిలా!

నా రాముడు! ఇక్ష్వాకు రాకుమారుడు! అత్యంత సుకుమారుడు!

ఘోరారణ్యములలో జటాధారియైసంచరించవలెనన్న క్రూరబుద్ధి నీలో ఎలా పుట్టింది! కైకా నీ కోరిక ఉపసంహరించుకో!.

అసలు నీకు రాముడు చేసినంత శుశ్రూష భరతుడు కూడా చేయలేదే!

రాముడు మహావీరుడు! ధర్మవీరుడు, దయావీరుడు, దానవీరుడు, యుద్ధవీరుడు!

కపటంలేని రామునియందు నీకింతకాఠిన్యం తగదు!

కైకా! కాటికి కాళ్ళు చాపుకొన్న ముసలివాడను నేను. నామీద కరుణచూపవే! నీ కాళ్ళు పట్టుకుంటాను. అని పరిపరి విధాలుగా ప్రాధేయపడుతున్నాడు దశరథమహారాజు.

ఎంత ఎంత వేడుతుంటే అంత అంత బెట్టు చేస్తున్నది కైక.

ఛీ దుర్మార్గురాలా నీ ముఖం చూస్తుంటేనే పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయి నాకు, అని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు దశరథుడు.

అయినా, నీ కోరిక భరతుడు మన్నిస్తాడనుకుంటున్నావా.. వాడు రామునికన్నా ధర్మాత్ముడు!

**రామాదపి తమ్ మన్యే ధర్మతో బలవత్తరం**

ఓ రాత్రీ తెల్లవారకు!

వద్దులే! శీఘ్రముగా వెళ్ళిపో నీవు, ఈ దుష్టురాలి గృహం నుండి త్వరగా వెళ్ళిపోవాలి నేను అని తనలోతను మాట్లాడుకుంటూ ఉన్నాడు దశరథుడు.

ఇంతటి దైన్యస్థితి జీవితంలో ఇదే మొదటిసారి దశరథుడికి, అంతకు మునుపెన్నడూ ఆయన ఇంతటి విపత్కర పరిస్థితిలో చిక్కుకొని ఎరుగడు.

కైక ఇంకా క్రూరంగా మాట్లాడటం మొదలుపెట్టింది. ఏమిటిది? నేనేదో కోరరానిది కోరినట్లు నీవంత బాధపడుతూ క్రిందపడి విలపిస్తున్నావు?

అసలు నీ ప్రాణం నేను పెట్టిన భిక్ష! పెద్ద సత్య సంధుడవైనట్లు ఆరోజు మాట ఇవ్వనేల, నేడు విలపించనేల.

శిబి చక్రవర్తి మాట కోసం శరీరంలో తన మాంసం కోసి ఇచ్చిన సంగతి నీవెరుగవా?

అలర్కుడు ఇచ్చిన మాట కోసం తన కన్నులు ఒక బ్రాహ్మణుడికి దానం చెయ్యలేదా!

సముద్రుడు చెలియలికట్ట దాటుతున్నాడా?

నీకు మూడుమాట్లు చెపుతున్నాను...

రాముడిని అడవికి పంపుము, పంపుము, పంపుము.

నీవు మాట నిలబెట్టకో! లేదా, నేను ప్రాణత్యాగం చేస్తాను. అని బెదిరించి దశరథుని తీవ్రమైన మానసిక వేదనకు గురిచేసింది కైక.



ఇంతలో భళ్ళున తెల్లవారింది. వసిష్ఠాది మునులంతా రామ పట్టాభిషేక మహోత్సవ ముహూర్తం సమీపిస్తుందని దశరథుని పిలుచుకొని రమ్మని సుమంత్రుని పంపారు.

సుమంత్రుడు కైక ఇంటికి వెళ్లి రాజుకు విషయం తెలిపాడు. దశరథుడు మాట్లాడే పరిస్థితిలో లేడు, కళ్ళు చింతనిప్పులవలె ఎర్రగా ఉండటం గమనించాడు సుమంత్రుడు.

సుమంత్రుడి ఆలోచన గ్రహించిన కైక రాత్రి సంతోషంతో నిదురలేక అలా అయినాయి ఆయన కళ్ళు. నీవు త్వరగా వెళ్లి రాముని ఇచ్చటికి తీసుకొనిరా అని ఆజ్ఞాపించింది కైక.

రాముడు వచ్చి దోసిలి యొగ్గి తండ్రి వద్ద వినయంగా నిలుచున్నాడు.

అయోధ్య అంతా సందడిగా ఉంది. ఎటుచూసినా పండుగే. ఎవరిని కదిలించినా రాముడి గుణగణాల ప్రస్తావనే. నేటినుండీ సుగుణాభిరాముడి పరిపాలనే! రామరాజ్యం కొన్ని ఘడియలలో ప్రారంభం కాబోతుంది. పగటి సమయంలో పుష్యమీ నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో రామచంద్రుడికి పట్టాభిషేకం.

బంగారుపాత్రలలో నదీ, నదముల జలాలు, నదీ సంగమస్థాన జలాలు, నాలుగు సముద్రాల జలాలు, గంగోదకం నిండిన పాత్రలు ఇలా అన్ని రకాల జలాలు సిద్ధం చేశారు. వాటిలో పేలాలుపోసి, పాలచెట్ల ఆకులు, కమలాలు, కలువలు కప్పి బంగారు, వెండి కలశాలు కూడా సిద్ధం చేశారు.

..(సశేషం)

# అక్రమార్కుల వేటలో టీడీపీ - విదేశాల బాటలో వైసీపీ

(మొదటిపేజీ తరువాయి)

వైసీపీ నాయకులు చేసిన అక్రమాలు, అకృత్యాలతో అస్తవ్యస్తమైన వ్యవస్థల్ని, అధికార విభాగాలని ప్రక్షాళన చేయడం కూడా పెను సవాలుగా మారిందని రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి.

### ఇక ఎప్పటికీ తామే అన్న ధీమాతో.. కొనసాగిన విధ్వంసం!

తమకు జనం 151 సీట్ల మెజారిటీ ఇచ్చారు కాబట్టి...

2019 అసెంబ్లీ ఎన్నికల తరువాత జరిగిన అన్ని స్థానిక సంస్థల ఎన్నికలలో తామే ఘన విజయం సాధించాం కాబట్టి...

తాను ఎక్కడికి వెళ్లినా సినిమా హీరోని చూసినట్లు జనం తనని చూడడానికి ఎగబడుతున్నారు కాబట్టి...

ప్రభుత్వ డబ్బులు జనం ఖాతాలో వేసి తాము ఓట్లు కొనుక్కుంటున్నాం కాబట్టి...

'నవరత్నాల' పేరుతో వజ్రాల్లాంటి పథకాలు అందించాం కాబట్టి...

వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తెచ్చాం కాబట్టి...

మంత్రులకి, పార్లమెంటు సభ్యులకి, శాసన సభ్యులకి అధికారాలు లేకుండా ప్రజలకి ఏం కావాలో తానే నేరుగా చేస్తున్నాను కాబట్టి...

తన ప్రభుత్వంలోని అధికారులు తాను చెప్పినట్టల్లా గంగిరెద్దుల్లా తలాడిస్తున్నారు కాబట్టి...

తన సలహాదారులు, తన చుట్టూ ఉన్న కోటరీ తన అడుగులకు మడుగులెత్తుతున్నారు కాబట్టి...

నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనారిటీలు అంటూ తన సొంత సామాజికవర్గం రెడ్లను నిర్వీర్యం చేసేశాం కాబట్టి...

తనని జనం గుడ్డిగా నమ్ముతున్నారు కాబట్టి...

175 సీట్లకి 175 తానే గెలవబోతున్నాను కాబట్టి...

రాబోయే ముప్పై సంవత్సరాలు ఆంధ్ర రాష్ట్రం తన సొంతం అన్న ధీమాతో, ఇక ప్రతిపక్షమే ఉండదన్న ధైర్యంతో వైసీపీ విధ్వంసరచన చేసిందన్నది విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ అధినేతతో సహా ఎవరిస్థాయిలో వాళ్ళు ఎక్కడ దొరికింది అక్కడ దోచేశారన్న మాట మేధావుల నుండి వినపడుతోంది. ప్రతీ మంత్రి, ఎంఎల్ఏ ఈ రాష్ట్రానికి తామే ముఖ్యమంత్రులమన్న తరహాలో అటు అధికారులని, ఇటు ప్రజలని, ప్రతిపక్ష పార్టీ నాయకులని, కార్యకర్తలని భయభ్రాంతులకి గురిచేశారని రాజకీయవర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. వారి వారి నియోజకవర్గాలలో మరొకరిని ప్రవేశించనీయకుండా దోపిడీలకు, దౌర్జన్యాలకి తెగబడి రాజకీయాలకి, పరిపాలనకి కొత్త భాష్యం చెప్పారని రాజకీయ శ్రేణులు చెప్తున్నారు. "స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి రాజకీయాలను గమనిస్తున్న తాను ఇలాంటి పరిపాలన తన తొంభైయేళ్ల జీవితంలో ఎప్పుడూ చూడలేదని" ఒక సీనియర్ కాంగ్రెస్ రాజకీయ నాయకుడు తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. తాజాగా జరిగిన ఎన్నికలలో వైసీపీ ఆశలు అడియాసలయ్యాయి. ఫలితాలు తారుమారయ్యాయి. అంచనాలు తల్లక్రిందులయ్యాయి. అసెంబ్లీలో తమపార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాకపోవడంతో ఆ పార్టీ శ్రేణులలో ఆందోళన మొదలయ్యింది.

### ఓవైపు పాలన, మరోవైపు ప్రక్షాళనతో దూకుడు పెంచిన డబుల్ ఇంజన్ సర్కారు!

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల కాలంలోనే తమ పనితనం చూపిస్తోంది. వాళ్ళు చెప్పినట్లుగానే డబుల్ ఇంజన్ స్పీడుని ప్రదర్శిస్తోంది. గత ప్రభుత్వం రచించిన విధ్వంసాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ వెళ్తోంది. రాజధాని నిర్మాణంలో వేగం పెంచింది. అన్ని వ్యవస్థలలో లోటుపాట్లను గుర్తించే పనిలోపడింది. ఆదాయ మార్గాలు అన్వేషిస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ మొత్తంలో నిధులు సాధించడానికి వ్యూహం రచిస్తోంది. రాష్ట్రంలో అంతర్జాతీయ పరిశ్రమలని స్థాపించాలనుకునే వారికి భరోసా కల్పిస్తోంది.

### అక్రమార్కుల వేట మొదలుపెట్టిన టీడీపీ!

ఇదే క్రమంలో... గత ప్రభుత్వంలో తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించిన వైసీపీ నాయకుల అవినీతి భాగోతాలను తవ్వి తీస్తోంది. వారి అక్రమాలని ఆధారాలతో సహా బయటపెట్టి వాళ్ళని ప్రజలముందు దోషులుగా నిలబెట్టే ప్రయత్నం మొదలుపెట్టింది. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తాన తందాన అన్న అధికారులను పక్కనపెట్టింది. వారికి పోస్టింగులు లేకుండా కూర్చోబెట్టింది. ఇప్పటికే కొంతమందిపైన కేసులు బనాయించి దర్యాప్తు ప్రారంభించింది. అక్రమార్కులు ఒక్కరిని కూడా వదిలిపెట్టేది లేదన్న సంకేతాలు స్పష్టంగా ఇస్తూ వేట మొదలుపెట్టింది.

### వైసీపీ నాయకుల విదేశాల బాట!

సల(స్వా)హాదారుల దగ్గర నుండి మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, పెద్ద నాయకుల బినామీలూ అందరి గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరిగెడుతున్నాయి. 'సిద్ధం' సభకి వచ్చిన జనాన్ని చూసి వాపుని బలుపనుకుని తమ ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించిన వారూ, మాట్లాడినవారూ తెరమరుగైపోతున్నారు. కొంతమంది అజ్ఞాతంలోకి వెళ్లిపోతుంటే... మరికొంత మంది విదేశాల బాట పడుతున్నారు. రఘురామరాజుపై హత్యాయత్నం చేశారంటూ సాక్షాత్తూ మాజీ ముఖ్యమంత్రినే కేసులో ముద్దాయిగా పెట్టడంతో మిగిలిన వాళ్ళకి ప్యాంట్లు, పంచెలు తడుస్తున్నాయని వైసీపీ శ్రేణులే మాట్లాడుకుంటున్నారు..! మొత్తానికి 'అదుదాం ఆంధ్రా' అని ప్రతిపక్ష వైసీపీ అన్న మాటలు సీరియస్‌గా తీసుకున్న అధికార టీడీపీ 'ఆట' మొదలుపెట్టింది...!

# మంత్రి నిమ్మల దృష్టికి.. కోవూరు సమస్యలు

## • విన్నవించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



రాష్ట్ర నీటిపారుదల మంత్రి నిమ్మల రామానాయుడు ఇటీవల నెల్లూరుకు వచ్చిన సందర్భంగా, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆయన్ను కలిసి కోవూరు నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పరిష్కారం కాని అనేక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. సాగునీటి కాలువలకు మరమ్మతులు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. రెండేళ్లకు ముందు పెన్నా నదికి వరదలొచ్చి ఇందుకూరుపేట మండలం పల్లిపాడు ఆశ్రమం వద్ద ధ్వంసమైన కరకట్టలను రిటైనింగ్ వాల్స్ నిర్మాణం ద్వారా పటిష్ట పరచవలసిందిగా మంత్రిని కోరారు.

అదేవిధంగా, గంగపట్నం పల్లిపాడు బ్రిడ్జ్, వవ్వేరు వద్ద కనిగిరి రిజర్వాయర్‌కు సంబంధించిన మరమ్మతులు, బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రెడ్డిపాలెం వద్ద పైడేరు ఎస్కేప్ కెనాల్, వవ్వేరు వద్ద ఈస్టర్న్ కెనాల్‌కు సంబంధించిన మరమత్తులకు సంబంధించి సమగ్ర నివేదికను ఆమె మంత్రికి సమర్పించారు. కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డిపాలెం హై లెవెల్ కెనాల్, పడుగుపాడు సమీపంలోని నక్కల మిట్ట కాలువ లేగుంటపాడు సదరన్ కెనాల్స్‌పై దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతులకు సంబంధించి వివరాలను మంత్రి దృష్టికి తెచ్చారు. నియోజకవర్గ పరిధిలోని బుచ్చిరెడ్డి పాళెం, కోవూరు, కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట మండలాలలోని గత ప్రభుత్వం పట్టించుకోని సాగునీటి కాలువల దుస్థితిని ఇరిగేషన్ అధికారుల ద్వారా ఎస్టిమేషన్లు వేయించి మంత్రి నిమ్మలకు గణాంకాలతో సహా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వినతిపత్రం అందించారు. అందుకు మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

# ఎన్‌బికెఆర్‌లో ఘనంగా 'జ్యోతి దినోత్సవం'



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల 89వ జ్యోతి దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఉన్న దివంగత విద్యాప్రదాత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విగ్రహానికి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ విద్యాసంస్థలకు బీజం వేసిన రోజును 'జ్యోతి దినోత్సవం'గా ప్రతి ఏటా జులై 15న జరుపుకుంటున్నామని, ఆ రోజుల్లో ఓ చిన్న పూరిపాకలో, రాత్రి పాఠశాలలో ప్రారంభమైన ఈ విద్యాసంస్థ అంచలంచెలుగా ఎదిగి నేడు అనేక కళాశాలలకు నిలయం మారిందని ఆయన తెలిపారు. వేలాదిమందికి విద్యనందించిన ఘనత బాలకృష్ణారెడ్డిదేనని, వారి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును బహుకరించిందని తెలిపారు. ఆ సంస్థల్లో భాగమైన ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల జాతీయస్థాయి విద్యాసంస్థలతో పోటీపడుతూ ముందంజలో ఉందన్నారు. ఈ విద్యాసంస్థలు దినదినాభివృద్ధి చెందడానికి కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కృషి అభినందనీయమని ఆయన కొనియాడారు.

# దానగుణానికి మారుపేరు.. 'అనసూయమ్మ' ఇక లేరు!



ప్రముఖ దానశీలి, తన దానగుణంతో అందరికీ ఆదర్శప్రాయురాలిగా నిలిచిన కాటంరెడ్డి అనసూయమ్మ ఈనెల 17వ తేదీ ఉదయం వృద్ధాప్యంతో అస్తమించారు. ఆమె వయసు 92 ఏళ్లు. స్వస్థలం ముత్తుకూరు మండలం పొట్టెంపాడు గ్రామం. కోవూరులో వివాహం చేసుకుని కాటంరెడ్డి వారింటి కోడలయ్యారు. జీవించినంతకాలం దానధర్మాలు చేస్తూ, పదిమందికీ సాయపడుతూ, తన మంచితనం, వితరణగుణంతో తన భర్తకు తోడు నీడగా ఉంటూ కోవూరులో శాశ్వతమైన పలు ధర్మకార్యాలను, దైవకార్యాలను కూడా నిర్వర్తించి తన జీవితాన్ని సార్థకం చేసుకున్నారామె.

కోవూరులో కాటంరెడ్డి వారంటే తెలియని వారుండరు. దాతృత్వానికి వారు మారుపేరు. ప్రముఖ వదాన్యునిగా పేరుగాంచిన కాటంరెడ్డి వెంకురెడ్డికి అనసూయమ్మ ధర్మపత్ని. దైవభక్తి, సమాజసేవాసక్తి కలిగిన ఈ దంపతులకు రాముడంటే ఎనలేని భక్తి. కోవూరులోని గాంధీబొమ్మ కూడలి వద్దనున్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానాన్ని భారీవ్యయంతో సర్వాంగ సుందరంగా పునర్నిర్మించి కోదండరామయ్య సేవలో వారు పునీతమయ్యారు. అంతే కాదు, పేదలకు వైద్యం అందించడం కోసం కోవూరులో రెండున్నర ఎకరాల స్థలాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తమ వితరణగా అందజేయడమే కాక, వెంకురెడ్డి తన తండ్రి కాటంరెడ్డి రామిరెడ్డి పేరుతో ఆ వైద్యశాలకు నామకరణం చేయించి, తండ్రిపేరును కూడా సార్థకం చేశారు. ఇప్పుడా ఆసుపత్రి కూడా నిత్యం వందలాదిమంది పేద రోగులకు వైద్యచికిత్సలం దిస్తోంది. అదేవిధంగా, పేదపిల్లల విద్యాభివృద్ధి కోసం కోవూరు ప్రభుత్వ బాలికల పాఠశాలకు ఏడెకరాల స్థలాన్ని దానమిచ్చి అనసూయమ్మ దంపతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆ విద్యాలయంలో ఏటా వేలాదిమంది పేద బాలికలు చదువుకుంటూనే ఉన్నారు. అటు మాధవసేవ.. ఇటు మానవసేవతో సమాజానికి తమవంతు సేవలందిస్తూ ఆ ధర్మాత్ములిద్దరూ తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. కాటంరెడ్డి అనసూయమ్మ-వెంకటరెడ్డి దంపతులకు అయిదుగురు సంతానం.. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వారి కుమారుడు కాటంరెడ్డి కృష్ణారెడ్డి ప్రస్తుతం కోవూరు కోదండరామాలయం ఛైర్మన్‌గా ఆలయం ఆలనాపాలనా చూస్తూ, తల్లితండ్రుల ఆశయాల బాటలో నడుస్తున్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న ఆయన నివాసం నుంచి ఈనెల 18వ తేదీ గురువారం జరిగిన అనసూయమ్మ అంతిమయాత్రలో ఆమె కుటుంబసభ్యులతో పాటు, స్థానిక ప్రముఖులు, కోవూరు ప్రాంతానికి చెందిన అనేక మంది ప్రజలు కూడా పాల్గొని ఆమెకు కడసారి కన్నీటి నివాళులర్పించారు. అటు ఆధ్యాత్మికంగా, ఇటు సామాజికంగా సమాజానికి అపారమైన సేవలందించిన మహనీయ దాత అనసూయమ్మ మృతికి చింతిస్తూ, ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.. 'లాయర్'.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు




పదవ తరగతి, ఇంటర్‌లలో 75శాతం మార్కులు సాధించిన 215 మంది శాలివాహన విద్యార్థులకు ఈనెల 13న నెల్లూరులోని 31వ డివిజన్ కొత్తూరు శాలివాహన సంఘం కల్యాణమండపంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.2వేలతో పాటు, జ్ఞాపిక, సర్టిఫికెట్‌లను బహుకరించారు. శాలివాహనసంఘం జిల్లా అధ్యక్షులు కె.ఎస్.నరసయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలాపురం శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువుతోనే సమాజంలో ఉన్నతస్థానం లభిస్తుందని చెప్పారు. సంఘం నాయకులు బొమ్మిన శ్రీనివాసులు(కృష్ణాజిల్లా), అయిలాపురం రాజా, ముగిలిచర్ల సుబ్బారావు, అద్దంకి సుబ్బారావు, పెళ్ళూరు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# 'రోటరీ' కార్యవర్గ ప్రమాణస్వీకారాలు



నెల్లూరులోని పలు రోటరీ క్లబ్‌ల కార్యవర్గాలకు ఇటీవల ప్రమాణ స్వీకారోత్సవాలు జరిగాయి. నెల్లూరు రోటరీ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో రోటరీ క్లబ్-నెల్లూరు సౌత్‌కు, రోటరీక్లబ్-నెల్లూరు అవెన్యూస్, రోటరీ క్లబ్-నెల్లూరు శక్తి సంస్థలకు కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవాలు నిర్వహించారు. రోటరీ డిస్ట్రిక్ట్-3160 సింహపురి జోన్-1 అసిస్టెంట్ గవర్నర్‌గా కొండా శేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనతో పాటు ఆ మూడు క్లబ్‌లకు అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీహరి, మల్లికాబేగం, సుమంకిత, పావనిరెడ్డి, కృష్ణచైతన్య, కళా కృష్ణస్వామి ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు ఉప రవాణా అధికారి చందర్, నందకుమార్, దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, నాగసతీష్‌బాబు, డాక్టర్ శ్రీకాంత్, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వశిష్టకు..విశిష్ట పురస్కారం



ప్రముఖ కవి సోమేపల్లి వశిష్ట (గుంటూరు) రచించిన 'ఆకు రాలిన చప్పుడు' కవితా సంపుటికి నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) విశిష్ట పురస్కారం లభించింది. ఈనెల 13న నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో పెరసం వారు వశిష్టను ఘనంగా సన్మానించి పెరసం అవార్డును బహుకరించారు. ప్రముఖ కవి సుంకర గోపాల్ ఆ పుస్తకాన్ని సమీక్షించారు. అనంతరం, అవ్వారు శ్రీధరబాబు రచించిన 'పడమటి సూర్యోదయం' కథా సంపుటిని ప్రముఖ నవలా రచయిత్రి డా. పెళ్ళకూరు జయప్రద ఆవిష్కరించారు. పలమనేరు బాలాజీ ఈ పుస్తకాన్ని సమీక్షించారు. జెన్‌కో విజిలెన్స్ విభాగం డీఎస్పీ శ్రీనివాసులు, తిరుపతి ఎస్వీయూనివర్శిటీ తెలుగుశాఖ అధిపతి మేడిపల్లి రవికుమార్, పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధిపతి కె.శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని సమాజానికి సాహిత్య ప్రయోజనాలను వివరించారు. పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచలనరసింహం, గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, గంగిశెట్టి శివకుమార్, కె అంకబాబు, హస్తి లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి గండికోట సుధీర్‌కుమార్ (బుచ్చిరెడ్డి పాళెం)ను పెరసం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## శ్రీసిటీ 'టాటా స్మార్ట్‌ఫుడ్స్'కు..

# 'లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్'

శ్రీసిటీలోని ప్రముఖ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ టాటా స్మార్ట్‌ఫుడ్స్ లిమిటెడ్ (టిఎస్ఎఫ్ఎల్)కు ప్రతిష్ఠాత్మక యుఎస్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ వారి 'లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్' గుర్తింపు లభించింది. సంస్థ యొక్క స్థిరమైన, పర్యావరణ హిత కార్యకలాపాలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. సుస్థిర పర్యావరణ లక్ష్యాలను సాధించే సంస్థలను గుర్తించే లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్ 'లీడ్' సర్టిఫికేషన్‌కు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉంది. ఈ ప్రక్రియలో పని సామర్థ్యం, నీటి సంరక్షణ, వ్యర్థాల తగ్గింపు, సుస్థిర పరికరాల వినియోగం వంటి కీలక అంశాలలో అసాధారణ పనితీరు కొలమానాలుగా టాటా స్మార్ట్‌ఫుడ్స్ సంస్థ లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్‌ను సొంతం చేసుకోవడం విశేషం. ఈ విజయం పట్ల టిఎస్ఎఫ్ఎల్ అసోసియేట్ డైరెక్టర్, ఫ్యాక్టరీ హెడ్ ఎస్.సి పురుషోత్తమన్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిష్ఠాత్మక లీడ్ ప్లాటినం సర్టిఫికేషన్ పొందినందుకు టిఎస్ఎఫ్ఎల్ బృందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. హరిత హిత చర్యల ద్వారా స్థిరమైన పారిశ్రామిక అభివృద్ధిని పెంపొందించాలనే శ్రీసిటీ లక్ష్యానికి ఇది నిదర్శనమన్నారు.

# గుంటూరు శేషేంద్రశర్మ..చిత్రపటం ఆవిష్కరణ



మహాకవి గుంటూరు శేషేంద్రశర్మ చిత్రపటాన్ని ఈనెల 16న ఆయన స్వస్థలమైన నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరులోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి కుమార్‌రాజా ఆవిష్కరించారు. శేషేంద్రశర్మ స్వగ్రామంలో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ గ్రంథాలయానికి శేషేంద్రశర్మ పేరు పెట్టేందుకు కూడా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తోటపల్లిగూడూరు ఎంపీడీఓ పలమనేరు బాలాజీ, కవులు ఈతకోట సుబ్బారావు, అవ్వారు శ్రీధరబాబు, పెరుగు రామకృష్ణ, పాయసం సుబ్రహ్మణ్యం, శ్రీమన్నారాయణ, టేకుమళ్ల వెంకటప్పయ్య, గుండాల నరేంద్రబాబు, కవయిత్రులు పాతూరు అన్నపూర్ణ, గోవిందరాజుల సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

# జొన్నవాడ ఆలయానికి ఎస్‌బీఐ వితరణ



జొన్నవాడలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి భారతీయ స్టేట్‌బ్యాంక్ వారు తమ సామాజికసేవల్లో భాగంగా 150 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌కూలర్ కొనుగోలుకు అవసరమైన 60వేల రూపాయలను తమ వితరణగా అందజేశారు. ఆమేరకు చెక్కును ఇటీవల ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎన్.శ్రీనివాసరావు, శేషగిరిలు ఆలయ అధికారులకు ఇచ్చారు.


# అల్లూరు 'పెద్దోడు' అదరగొట్టేశాడు

## జాతీయస్థాయి పోటీల్లో బహుమతి సాధించాడు



ఏకపాత్రాభినయాల్లో సాటిలేని మేటిగా ఉంటూ, గతంలో విజయవాడలో జరిగిన జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీల్లో ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా ప్రథమ బహుమతిని అందుకున్న విలక్షణ నటుడు, అల్లూరీయుడు..బడబాగ్ని ఆంజనేయరాజు, మళ్ళీ చాలా ఏళ్ళ తర్వాత ఇటీవల ఒంగోలులో జరిగిన ఏకపాత్రాభినయ పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయస్థాయిలో అద్భుతమైన 56 ఏకపాత్రాభినయాలు పోటీకి వచ్చినా, రాజకీయ వ్యంగ్యాస్త్రాలతో తాను రూపొందించుకున్న 'పెద్దోడు' ఏకపాత్రాభినయంతో ప్రేక్షకుల ప్రశంసలందుకోవడమే కాక, తృతీయ బహుమతిని సాధించుకున్నాడు. రంగస్థల నటనలోనే కాక, బుల్లితెరపై కూడా ఆయన వైవిధ్యభరితమైన పాత్రలు పోషించారు. పలు సినిమాల్లోనూ నటించారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్‌బోర్డు డైరెక్టర్‌గా అనేక సినిమాలకు సెన్సార్ బాధ్యతలు నిర్వహించారు. 'పెద్దోడు' పాత్రలో జీవించి, బహుమతిని సాధించిన ఆంజనేయరాజును జిల్లాలోని పలువురు కళాకారులు, కళాభిమానులు అభినందించారు.

# టూకీగా...



## వైభవంగా... పెంచలస్వామి కల్యాణోత్సవం

రాపూరు మండలం పెంచలకోనలో వెలసివున్న ఆదిలక్ష్మి-చెంచులక్ష్మీ సమేత శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం ఈనెల 13న అత్యంత వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. ఆలయ ఏ.సి సాగర్‌బాబు పర్యవేక్షించారు.

## పల్లిపాడులో రైతులకు జొన్న విత్తనాలు పంపిణీ

ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు గాంధీ ఆశ్రమంలో జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా ఈనెల 13న రైతులకు 75 శాతంతో హైబ్రిడ్ జొన్న విత్తనాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డా. వి.కోటేశ్వరరావు, డా. బి.మురళీకృష్ణ, డా. కె.హరిబాబు, కె.జస్వంత్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు

## ఆత్మకూరులో పేదకుటుంబానికి 'జనసేన' సాయం

పేదలకు చేతనైనంత సాయం అందించాలని తమ నాయకుడు పవన్‌కల్యాణ్ సూచనలతో, ఆత్మకూరులో ఓ పేదకుటుంబానికి జనసేన నాయకులు ఇటీవల మృతిచెందిన పాశం వెంకటేశ్వర్లు కుటుంబానికి జనసేన నాయకుడు నలిశెట్టి శ్రీధర్‌బాబు 7వేల రూపాయలను తమవంతు సాయంగా అందజేశారు. జనసేన నాయకులు జేపీ ప్రసాద్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## వరికుంటపాడు హైస్కూల్‌కు దాతల వితరణ

వరికుంటపాడు జడ్పీహైస్కూల్‌కు దాత యర్రా చిన బ్రహ్మయ్య ఇటీవల రూ. 16వేల విలువైన జెరాక్స్ ప్రింటర్‌ను తన వితరణగా అందజేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనలతో స్కూల్‌కు ఆ సాయం అందజేశామని ఆయన చెప్పారు. హెడ్మాస్టర్ వీరభద్రరావు, నాయకులు మాగంటి మాలకొండయ్య, పఠాన్ నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

## మద్దూరుపాడులో టిడ్కో ఇళ్ళ తనిఖీ

కావలి సమీపంలోని మద్దూరుపాడు గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్ళను ఇటీవల కావలి మునిసిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, డెప్యూటీ ఇంజనీర్, సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్ళి పరిశీలించారు. ఆ ఇళ్లల్లో ఉన్నవారికి సమస్యలేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## కలిగిరి జడ్పీస్కూల్‌లో స్టూడెంట్స్ కిట్స్ పరిశీలన

కలిగిరి జడ్పీ ఉన్నత పాఠశాలను ఇటీవల స్టూడెంట్ కిట్స్ అబ్జర్వర్ శారదాకుమారి సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని, స్టూడెంట్ కిట్స్‌ను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందికి సూచించారు. సీఎంఒ రామయ్య, ఎంఇఒ సురేష్ పాల్గొన్నారు.

## సైదాపురం వద్ద ఇసుక ట్రాక్టర్ సీజ్

సైదాపురంలోని కైవల్యానది ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఇటీవల ఎస్ఐ విజయకుమార్ సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నామన్నారు. అక్రమంగా ఎవరైనా సరే ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## మనుబోలు గంగమ్మకు ప్రత్యేక పూజలు

మనుబోలు చెరువుకట్టపై కొలువైవున్న గ్రామదేవత గంగమ్మతల్లికి ఇటీవల ఆషాడమాసం ప్రత్యేకపూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారిని పూలతో అలంకరించి, క్షీరాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం చేసి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మోచర్ల మల్లికార్జున ఉభయకర్తగా వ్యవహరించారు.

## మొగళ్ళూరులో పేకాటరాయుళ్ళ అరెస్ట్

పొదలకూరు మండలంలోని మొగళ్ళూరు శివార్లల్లో ఉన్న పేకాటస్థావరంపై పోలీసులు ఇటీవల దాడి చేసి నలుగురు పేకాటరాయుళ్ళను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 24,700 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. పొదలకూరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడిచేశారు.

# శ్రీసిటీలో మెగా ఉద్యోగ మేళా!

- అభ్యర్థుల నుంచి విశేష స్పందన
- 150 మందికి ఉద్యోగాలు



శ్రీసిటీ-ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఈనెల 16న శ్రీసిటీలో నిర్వహించిన మెగా ఉద్యోగమేళాకు విశేష స్పందన లభించింది. 10 ప్రముఖ పరిశ్రమలతో పాటు 2022, 2023, 2024లో ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్ ఉత్తీర్ణులైన సుమారు 400 మంది ఈ మేళాలో పాల్గొన్నారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం 363 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి అభ్యర్థులు రాగా, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి ఎక్కువ మంది తరలివచ్చారు. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేసిన 150మంది అభ్యర్థులకు ఆయా కంపెనీలు వెంటనే ఉద్యోగ నియామక పత్రాలను అందజేయడం విశేషం. ఉద్యోగాన్వేషణలో ఉన్న అర్హత కలిగిన అభ్యర్థులను శ్రీసిటీ పరిశ్రమలతో అనుసంధానం చేసేందుకు రూపొందించబడిన ఈ నియామక కార్యక్రమంలో ఎంపిక ప్రక్రియ కోసం అధునాతన సాంకేతికతను వినియోగించారు. మేళాలో భాగస్వామ్యులైన ఏఎల్ఎఫ్ ఇంజినీరింగ్, ఎన్ఎస్ నిప్పన్ సెయికి, బ్రేక్స్ ఇండియా, డైకిన్, ఆక్సిలెంట్ ఫార్మా, టోరే, ఆస్ట్రోటెక్ స్టీల్స్, సుందరం ఫాస్టెనర్స్, ఆల్‌స్టోమ్‌తో సహా పలు పారిశ్రామిక సంస్థలు, కొత్త ఉద్యోగులను నియమించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చక్కగా ఉపయోగించుకున్నాయి. ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ వారి స్మార్ట్ సాంకేతికత ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించింది. ఒకే రోజులో వివిధ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో ప్రతిభ కలిగిన అభ్యర్థులను కంపెనీలు ఎంపిక చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో, శ్రీసిటీలోని కంపెనీలు మానవ వనరుల కోసం పెట్టుబడి పెట్టడాన్ని తాను స్వాగతిస్తున్నానని, సంస్థల నిరంతర వృద్ధికి ఇది చాలా అవసరమని పేర్కొన్నారు. ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ భాగస్వామ్యంతో పరిశ్రమ డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్రాంతంలోని యువత ప్రతిభను పెంపొందించే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామన్నారు.



# మత సామరస్యానికి ప్రతీక.. 'రొట్టెల పండుగ' వేడుక

- పండుగ శోభతో ప్రకాశిస్తున్న బారా షహీద్ దర్గా
- లక్షలాదిగా తరలివస్తున్న భక్తులు
- భక్తజనసంద్రంగా మారిన నెల్లూరు
- 2 వేల మందితో భారీ బందోబస్తు

**మ**తసామరస్యానికి ప్రతీకగా మొహర్రం నెలలో నెల్లూరులో జరిగే అతిపెద్ద పండుగ రొట్టెల పండుగ. నెల్లూరు నగరంలో వెలసివున్న అత్యంత పవిత్రమైన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఈ పండుగ వేడుకలు ప్రారంభం కావడంతో దర్గా ప్రాంతమంతా కళకళలాడుతోంది. విద్యుద్దీప కాంతులతో దర్గా పరిసరాలన్నీ దేదీప్యమానంగా ఉన్నాయి. ప్రత్యేకపూజలు, ప్రార్థనలతో దర్గా భక్తజన కోలాహలంతో నిండిపోయింది.

ప్రపంచప్రసిద్ధి గాంచిన ఈ దర్గాలో ఈనెల 17 నుంచి జరుగుతున్న వేడుకల్లో భాగంగా ఎంతో విశిష్టమైన రొట్టెల పండుగకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితమైన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జరిగే రొట్టెల పండుగకు దేశ విదేశాల నుంచి కులమతాలకు అతీతంగా లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో, నెల్లూరు నగరం భక్తజన సంద్రంగా మారింది. అన్ని దారులూ దర్గావైపే అన్నట్లుగా.. నగరంలో ఏ వీధి చూసినా భక్తజన ప్రవాహమే. ఈనెల17 నుంచి అయిదురోజుల పాటు జరిగే రొట్టెలపండుగలో 17న సందన్‌మాలీ, 18వతేది రాత్రి అత్యంత వైభవంగా గంధ మహోత్సవం జరుగుతాయి. 19న రొట్టెల పండుగ ప్రారంభమవుతుంది. 20న తహలిల్ ఫాతీహా, ఆ తర్వాత 22న ముగింపు వేడుకలు ఉంటాయి. అందుకు తగ్గట్టుగా దర్గా నిర్వాహకులు, జిల్లా అధికారులు సంయుక్తంగా భారీ ఏర్పాట్లు చేశారు. అయితే, ఈసారి పండుగకు రెండు రోజుల ముందుగానే వేలసంఖ్యలో భక్తజనం నెల్లూరుకు తరలివచ్చి స్వర్ణాలచెరువులో ఒకరినుంచి మరొకరు కోర్కెల రొట్టెలు పట్టుకోవడం విశేషం.



రొట్టెల పండుగను పురస్కరించుకుని బారాషహీద్ దర్గా ప్రాంగణం వద్ద, నగరంలోనూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2వేల మంది పోలీసులతో జిల్లా కొత్త ఎస్పీ కృష్ణకాంత్ భారీ బందోబస్తు ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి, మళ్లీ టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగే తొలి రొట్టెలపండుగ ఇదే కావడంతో, కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తులకు లోటు లేకుండా సదుపాయాల కల్పనలో నిమగ్నమయ్యారు. రాష్ట్రమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ సేతుమాధవన్, నగరపాలక సంస్థ అధికారులు, అనేకమంది నాయకులు భక్తులకు ఎక్కడా ఎలాంటి కొరత లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



## 5వ వర్ధంతి



### శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

(స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి)

పరమపదించి జూలై 20, 2024 నాటికి

ఐదేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా...

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

- కుటుంబసభ్యులు

జననం : 16.10.1930 నిర్యాణం : 20.07.2019

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com